

కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

బీమా మాయ..!

- పలు పంటలకు దక్కని బీమా
- నష్టపోయిన ప్రాంతాల్లోనూ రాని వైనం

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పంటల బీమా మాయలా మారిపోయింది. పంట సాగు చేసి నష్టపోయినా పలు ప్రాంతాల్లో బీమా దక్కలేదు. ప్రభుత్వం 12 రకాల పంటలకు ప్రకటించినా చాలా ప్రాంతాల్లో ప్రధాన పంటలకు స్థానం దక్కలేదు...

వైఎస్ఆర్ పంటల బీమా కింద మంజూరైన పరిహారాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. కర్నూలు జిల్లాలో బీమా కింద 12 రకాల పంటలకు జిల్లా వ్యాప్తంగా రూ.192.51 కోట్లు మంజూరైనట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. పలు పంటలకు బీమా మంజూరు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు మంజూరు చేసినా పలు ప్రాంతాల్లో ప్రధానంగా నష్టపోయిన పంటలకు బీమా దక్కడం లేదు. ఎమ్మిగనూరు, గోనెగండ్ల, నందవరం మండలాలలో ప్రధానంగా పత్తి, వేరుశనగ, మిరప, ఉల్లి పంటలు వేశారు. ఎకరాకు పత్తి పంటకు రూ.వెయ్యి నుండి 5వేల వరకు మాత్రమే పరిహారం వచ్చింది. ఉల్లికి ఎకరాకు రూ.పదివేలు, వేరుశనగకు రూ.4వేల నుంచి రూ.5 వేలు మాత్రం వచ్చాయి. కౌతాళం మండలంలో పత్తి ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసినప్పటికీ తక్కువ విస్తీర్ణానికి బీమా సొమ్ము మంజూరైనట్లు సమాచారం. అత్యధికంగా సాగు చేసిన పత్తి పంటకే ఎకరాకు రూ.వెయ్యి నుంచి రూ.2వేలు మాత్రమే ఇచ్చారు. వేరుశనగకు ఎకరాకు రూ.4వేలు ఇవ్వగా మిరపకు అసలే ఇవ్వలేదు. హొళగుంద మండలంలో పత్తి, మిరప, వేరుశనగ, ఉల్లి పంటలను సాగు చేశారు. పత్తికి ఎకరాకు రూ.2వేలు మాత్రమే ఇచ్చారు. ఉల్లికి ఎకరాకు రూ.పదివేలు ఇచ్చారు. మిరప, వేరుశనగకు అసలే ఇవ్వలేదు. తుగ్గలి మండలంలో పత్తి, వేరుశనగ, ఉల్లి, కంది, సజ్జ, ఆముదాలు పంటలు ప్రధానంగా సాగు చేశారు. పత్తికి ఎకరాకు రూ.2 వేలకు పైగా, వేరుశనగకు రూ.మూడు వేలకు పైగా ఉల్లికి రూ.10600 ఇవ్వగా కంది, ఆముదాలు, సజ్జ, టమోటా పంటలకు అసలు బీమా సొమ్ము మంజూరు కాలేదు. ఓర్వకల్లు మండలంలో పత్తి, మొక్కజొన్న, కొర్ర, ఆముదం, ఉల్లి పంటలు వేశారు. ఉల్లి పంటకు మినహా ఏ పంటకూ పరిహారం దక్కలేదు. కోడుమూరు మండలంలో పత్తి, ఉల్లి, వేరుశనగ, కందులు, మిరప పంటలు సాగు చేశారు. పత్తికి ఎకరాకు రూ.1360, ఉల్లిపంటకు రూ.10,200, వేరుశనగకు రూ.2100 ఇచ్చారు. కందులు, ఆముదాలు, మిరపకు అసలే ఇవ్వలేదు. కల్లూరు మండలంలో పత్తి, మిరప, ఉల్లి, మొక్కజొన్న, కందులు, వేరుశనగ తదితర పంటలు వేశారు. పత్తి, ఉల్లి పంటలకు మాత్రమే పరిహారం వచ్చింది. కర్నూలు మండలంలో ఉల్లి పంటకు మాత్రమే వచ్చింది. పత్తి పంటకు తాండ్రపాడు గ్రామంలో ఏడు మందికి మాత్రమొచ్చింది. మిగతా 50 మందికి రాలేదు. పత్తికొండ మండలంలో పత్తి, ఉల్లి, టమోట, మిరప తదితర పంటలేశారు. పత్తికి ఎకరాకు రూ.6వేలు, ఉల్లికి రూ.10వేలు పరిహారం వేశారు. మిగతా పంటలకు వేయలేదు. ఇలా ప్రధానంగా సాగు చేసిన పంటలకు కూడా బీమా ఇవ్వకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీమా మాయగానే మిగిలిపోతోందన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

అన్ని పంటలకూ పరిహారం ఇవ్వాలి

గత సంవత్సరం ఖరీఫ్‌లో పంటలు పూర్తిగా దెబ్బతిని దిగుబడి రాలేదు. జిల్లాలో పత్తి పంట 2.50లక్షల హెక్టార్లలో వేయగా దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఏ పంట అయితే నష్టపోయిందో ఆ పంటకు పరిహారం ఇవ్వకపోవడం దారుణం. ప్రభుత్వం మరో సారి పునరాలోచన చేసి నష్టపోయిన పంటలన్నిటికీ బీమా పరిహారం చెల్లించాలి.

- జి.రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి.

ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలి

- కలెక్టరేట్ ఎదుట డివైఎఫ్ఐ ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఎస్ఐ, కానిస్టేబుల్ రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు వెంటనే ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి నగేష్ డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు కలెక్టరేట్ ముందు ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు తక్షణమే ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని కోరుతూ డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాఘవేంద్ర అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న ఆ సంఘం జిల్లా కార్యదర్శి నగేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా మాట్లాడుతూ ప్రిలిమ్స్ పరీక్షలు జనవరి చివరిలో నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం హడావిడి చేసిందన్నారు. ఎన్నికల ముగియగానే నిరుద్యోగులను ముఖ్యంగా ఎస్ఐ కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. నిరుద్యోగంతో బాధపడుతున్న లక్షలాదిమంది ప్రతి నెల రూ.8 నుండి 10 వేల వరకు ఇంటి బాడిగలు, హాస్టల్ మేస్ స్టడీ హాల్స్‌కు ఖర్చు పెట్టుకోవాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఎస్ఐ కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు . ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు శిరీష, శంకర్, రంగప్ప, న్యూ సిటీ కార్యదర్శి హుస్సేన్‌బాష, కర్నూలు మండల కార్యదర్శి ప్రకాష్, నాయకులు విక్రమ్, హరికిషన్, అమర్, అంజి,రఘు ,శివ, బాబి,శ్రీను ,సాయి, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులను రెగ్యులర్ చేయాలి

- కలెక్టర్‌రేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట ఎదుట నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం రాష్ట్రనాయకులు రవినా జ్యోతి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంజిబాబు మాట్లాడారు. పొరుగు రాష్ట్రాలైన ఒరిస్సా, అస్సాం, హర్యానా, పంజాబ్ ,హిమాచల్‌ప్రదేశ్, ఢిల్లీ రాష్ట్రాలలో హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేశారన్నారు. మన రాష్ట్రంలో కూడా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి రాకముందు జగన్ పాదయాత్ర సందర్భంగా కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఇటీవల క్యాబినెట్‌లో 10717 మంది మాత్రమే రెగ్యులర్ అయ్యే అవకాశం ఉందని తీర్మానించారన్నారు. రాష్ట్రంలో 3 లక్షల మంది కాంట్రాక్టు ఉద్యోగులు ఉన్నారన్నారు. నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులందరినీ కూడా రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. రెగ్యులర్ చేసేంతవరకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, మినిమం టైమ్స్ స్కేలు అమలు చేయాలని కోరారు. కమిషనర్ ఇచ్చిన జీవో నెంబర్ 60 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. 2022 నవంబర్ నుండి రావల్సిన అరియర్స్ వెంటనే ఇవ్వాలని కోరారు. హెచ్‌ఆర్ పాలసీ, హెల్త్ ఇన్సూరెన్స్, జనరల్ ఇన్సూరెన్స్ అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నూర్‌బాషా ,చంద్రశేఖర్, అరుణ్ కుమార్, రమేష్ అనురాధ, శోభ, నారాయణమ్మ, జ్యోతి, సిఐటియు జిల్లా నాయకులు ప్రభాకర్, సుధాకరప్ప పాల్గొన్నారు.

సిఐటియు ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నేషనల్ హెల్త్ మిషన్ ఉద్యోగులు

వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సృజన

అర్జీలు రీ ఓపెన్ కాకూడదు

- కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జగనన్నకు చెబుదాం, స్పందన వినతులకు సత్వర పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన వినతులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన, జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య స్వీకరించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్పందన, జగనన్నకు చెబుదాం ద్వారా వచ్చిన అర్జీల పరిష్కారంలో ఎటువంటి అలసత్వం వహించకూడదన్నారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి అందే వినతులను వెంటనే పరిశీలించి పరిష్కార మార్గం చూపాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రతి హెచ్‌ఒడి ఈ కార్యక్రమాన్ని సీరియస్‌గా తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎక్కడా పెండింగ్ ఉండకూడదన్నారు. కేంద్ర రోడ్డు రవాణా , రహదారుల మంత్రిత్వ శాఖ ఆదేశాల ప్రకారం ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ అనుబంధ సంస్థలు, మున్సిపల్ కార్పొరేషన్, ప్రజా రవాణా వాహనాలకు సంబంధించి 15 సంవత్సరాలు పైబడిన వాహనాల వివరాలను నిర్ణీత ప్రొఫార్మాలో పూర్తి చేసి, రవాణా శాఖ కార్యాలయానికి పంపాలని, సదరు వివరాలను కేంద్ర ప్రభుత్వానికి పంపుతామన్నారు. డిఆర్‌ఒ నాగేశ్వర రావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, జిల్లా పరిషత్ సిఇఒ నాసర రెడ్డి, సిపిఒ అప్పలకొండ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టిడిపి గెలుపే ధ్యేయంగా పని చేయాలి

- విస్తృత స్థాయి సమావేశంలో నేతల పిలుపు
- కర్నూలు జిల్లా టిడిపి అధ్యక్షులుగా బిటి నాయుడు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి -కర్నూలు హాస్పిటల్

రాబోయే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పని చేయాలని, తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబును చూడాలంటే ప్రతి నియోజకవర్గంలో పార్టీ గెలుపొందాల్సిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి కర్నూలు, నంద్యాల ఇన్‌ఛార్జి వైకుంఠం ప్రభాకర్ చౌదరి పిలుపునిచ్చారు. కర్నూలు జిల్లా టిడిపి విస్తృత స్థాయి సమావేశం కర్నూలు దేవి ఫంక్షన్‌హాలులో సోమవారం కోడుమూరు ఇన్‌చార్జి ఆకేపోగు ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి కర్నూలు జిల్లాలోని ముఖ్య నాయకులు, అన్ని స్థాయి కమిటీల సభ్యులు హాజరయ్యారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముందుగా వైకుంఠం ప్రభాకర చౌదరి టిడిపి కర్నూలు పార్లమెంట్ నూతన అధ్యక్షుడిగా నియమించిన బిటి.నాయుడుతో ప్రమాణ స్వీకారం చేయించారు. విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన ప్రముఖులు ప్రసంగించారు. రాబోయే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతి ఒక్కరు పని చేయాలని, తిరిగి రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబును చూడాలంటే ప్రతి నియోజకవర్గంలో పార్టీ అభ్యర్థి గెలువాలన్నారు. గత ఎన్నికలకు, రానున్న రోజులలో జరిగే ఎన్నికలకు చాలా వ్యత్యాసం ఉందని అన్నారు. రాష్ట్రంలో ఒక అవినీతి తుగ్లక్ సైకో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఉన్నారని ఈ ఎన్నికల్లో వైసిపిని ఓడించకపోతే ఆంధ్ర రాష్ట్రానికి ఇక భవిష్యత్ ఉండదని అన్నారు. ఈ సమావేశమునకు పొలిట్‌బ్యూరో సభ్యులు కాల్వ శ్రీనివాసులు, హిందూపురం పార్లమెంట్ అధ్యక్షులు బికె.పార్థసారధి, జాతీయ పార్టీ ఉపాధ్యక్షులు కోట్ల జయసూర్యప్రకాశ్ రెడ్డి, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మంత్రి కెఇ.ప్రభాకర్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కె.భూపాల్‌చౌదరి, పార్టీ నియోజకవర్గం ఇన్చార్జీలు టిజి.భరత్ (కర్నూలు), కెఇ.శ్యాంబాబు (పత్తికొండ), పి. తిక్కారెడ్డి (మంత్రాలయం), కె.మీనాక్షినాయుడు (ఆదోని), కోట్ల సుజాతమ్మ (ఆలూరు), నంద్యాల పార్లమెంట్ అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, రాష్ట్ర పార్టీ కార్యదర్శులు పిజి.నరసింహులు, యాదవ్, నంద్యాల నాగేంద్ర, బత్తిన వెంకట్రాముడు, పోతురాజు రవికుమార్, ముఖ్యనాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రమాణం స్వీకారం చేస్తున్న బిటి.నాయుడు

వర్క్ అడ్జెస్ట్‌మెంట్ ఉపాధ్యాయులకు గౌరవవేతనం చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

వర్క్ అడ్జస్ట్ మెంట్ కింద ఉన్నతపాఠశాలలో 3నెలల పాటు పనిచేసిన ఉపాధ్యాయులకు గౌరవేతనం చెల్లించాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్య దర్శులు జె.ఎల్లప్ప, ఎస్ఎం.జయరాజు డిమాండ్ చేశారు. సోమవారం యుటిఎఫ్ జిల్లా ప్రతినిధి బృందం డిఇఒ రంగారెడ్డికి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉన్నతపాఠశాలలో సబ్జెక్టు టీచర్ల కొరత తీర్చడానికి గత విద్యాసంవత్సరం జనవరి నుండి ఏప్రిల్ వరకు జిల్లాలో 1400 మంది సీనియర్ ఎస్‌జిటి సేవలు వినియోగించుకున్నారన్నారు. వారంతా పనిచేస్తున్న మండలాలు వదిలి సుమారు 100 కిలోమీటర్ల దూరంలో వున్న మండలాలలో పనిచేశారన్నారు. జీతం మాత్రం పాత మండలంలో ఇచ్చారన్నారు. వారికి అదనంగా నెలకు రూ. 2500 గౌరవ వేతనం ఇస్తామని ప్రభుత్వం చెప్పిందని, అందుకు అనుగుణంగానే మే28న వారికి గౌరవవేతనం చెల్లించాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. కాని డిఇఒ, ఎంఇఒ వారికి గౌరవవేతనం చెల్లించడంలో నిర్లక్ష్యంగా ఉన్నారన్నారు. వర్క్ అడ్జస్ట్ మెంటు కింద పనిచేసిన ఉపాధ్యాయులంతా ప్రస్తుతం ప్రమోషన్స్ ద్వారా ఇతర మండలాలకు వెళ్లారన్నారు. పాత మండలంలో వారికి గౌరవవేతనం చెల్లించడానికి వీలు కాదని సబ్ ట్రెజరీ అధికారులు చెబుతున్నారన్నారు. గౌరవవేతనం సంబందించిన బిల్లులు ఎస్‌టిఒకు సబ్మిట్ చేసి తర్వాత ఎల్‌పిసి జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు రవికుమార్, ఆర్థిక కార్యదర్శి హేమంత్ కుమార్, జిల్లా కార్యదర్శి నవీన్ పాటీ, సీనియర్ నాయకులు కృష్ణమూర్తి, మండలనాయకులు నారాయణరెడ్డి, మార్కు, శివకుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డిఇఒకు వినతిపత్రం ఇస్తున్న యుటిఎఫ్ నాయకులు

28 నుంచి మహిళల పోరు యాత్ర

పోరు యాత్ర కరపత్రం విడుదల చేస్తున్న ఐద్వా నాయకులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఈనెల 28 నుండి ఆగస్టు 9 వరకు మహిళలపై జరుగు హింస పైన జరుగు మహిళ పోరు యాత్రను జయప్రదం చేయాలని ఐద్వా జిల్లా కార్యదర్శి ఎన్ అలివేలు కోరారు. సోమవారం సుందరయ్య భవన్లో మహిళా పోరుయాత్రకు సంబంధించిన కరపత్రాన్ని విడుదల చేశారు. ఎన్.అలివేలు మాట్లాడుతూ మహిళలపై హింస విపరీతంగా పెరుగుతుందన్నారు. మల్ల యోధులు ఢిల్లీలో చేసిన ఆందోళన ఓ నిదర్శనమని అన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల పట్ల నిర్లక్ష్య ధోరణితో ఉన్నాయన్నారు.ప్రభుత్వాలు హింసను అరికట్టే వరకు పోరాటం చేయాలని, అందుకే ఐద్వా ఆధ్వర్యంలో మహిళల పోరు యాత్ర చేపడుతున్నట్లు తెలిపారు.న్యూ సిటీ అధ్యక్ష కార్యదర్శులు కె.అరుణ, జి.ధనలక్ష్మి జిల్లా నాయకులు కెఎస్ పద్మ, పిఎస్. సుజాత , ఇఎల్ఎస్ రత్నమ్మ, నగర నాయకులు షబానా పర్వీన్, కుమారి, సీతమ్మ, శిరీష, నోమేశ్వరి, సావిత్రి, లక్ష్మీబాయి తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 114 ఫిర్యాదులు

విచారించి న్యాయం చేస్తాం: ఎస్‌పి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

స్పందన కార్యక్రమానికి సోమవారం మొత్తం 114 ఫిర్యాదులు వచ్చాయని కర్నూలు ఎస్‌పి జి.కృష్ణకాంత్ తెలిపారు. వచ్చిన ఫిర్యాదులపై విచారణ జరిపి చట్ట పరంగా న్యాయం చేస్తామని అన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమంకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాదు దారులతో ఆయన మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...

ఆదోని మార్కెట్ యార్డులో డేటా ఎంట్రీ ఆపరేటర్ ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి ఒక వ్యక్తి డబ్బులు తీసుకొని మోసం చేశారని ఎదురూరు గ్రామానికి చెందిన రామాంజనేయులు ఫిర్యాదు చేశారు. సాగులో ఉన్న మా పొలాన్ని ఆన్ లైన్‌లో తమ పేరు మీద నమోదు చేసుకుని నా పై దౌర్జన్యం చేస్తున్న వారి పై చర్యలు తీసుకోవాలని గోనెగండ్ల మండలంపెద్దనేలటూరు గ్రామానికి చెందిన సుందర్ రాజు ఫిర్యాదు చేశారు. 108 ప్రభుత్వ సర్వీస్ వాహనాలకు ఒక వ్యక్తి రెండు నెలల నుండి 7702230785 నెంబర్ నుండి పలుసార్లు ఫోన్లు చేస్తూ, రోడ్డు ప్రమాదాల కేసులు జరిగాయని అబద్దాలు చెబుతూ 108 సేవకు అంతరాయం కలిగిస్తున్న వ్యక్తి పై చర్యలు తీసుకోవాలని కర్నూలు 108 కు చెందిన నవీన్ కుమార్, మహేష్ ఫిర్యాదు చేశారు. ఆన్ లైన్ లో 5 లక్షలు లోన్ ఇస్తామని చెప్పి ఇన్సూరెన్స్ ,జిఎస్‌టి చార్జీల పేరుతో డబ్బులు తీసుకుని మోసం చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఓర్వకల్లు మండలం, ఉయ్యాలవాడ గ్రామానికి చెందిన భారతి ఫిర్యాదు చేశారు. డిఎస్‌పి యుగంధర్ బాబు , లీగల్ అడ్వైజర్ మల్లికార్జునరావు, సిఐలు పాల్గొన్నారు.

ఎస్‌పి జి.కృష్ణకాంత్‌కు సమస్యను వివరిస్తున్న మహిళ

లబ్ధిదారులకు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ జె.సుధాకర్, ఎంపిపి

జగనన్న సురక్షతో ప్రజలకు మేలు : ఎమ్మెల్యే సుధాకర్

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలు వచ్చి చేరుతున్నాయని కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ అన్నారు. సోమవారం కర్నూలు మండలం బి.తాండ్రపాడు టివి9 కాలనీ దగ్గరి కాదంబరి కాలనీలో ఎమ్మెల్యే అధ్వర్యంలో 'జగనన్న సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా ఉచితంగా కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రం, రేషన్ కార్డుకు సంబందించిన అనేక సేవలను పొందిన వారికి కోడుమూరు ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేశారు. కర్నూలు ఎంపిపి వాసు వెంకటేశ్వరమ్మ, జడ్‌పిటిసి ప్రసన్నకుమార్, మాజీ మండలం ఉపాధ్యక్షులు వాసు, చిన్న లక్ష్మన్న, మోహన్ బాబు, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీని అరికట్టాలి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ జిల్లావ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ ప్రయివేట్ పాఠశాలలు విచ్చలవిడి ఫీజుల దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ డిమాండ్ చేసింది. ఈ మేరకు జిల్లా కలెక్టర్‌ను ఎస్ఎఫ్ఐ ప్రతినిధి బృందం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా మాట్లాడుతూ కొన్ని ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలలో రకరకాల పేర్లతో ఫీజుల దోపిడీ చేస్తున్నారని, ప్రధానంగా పుస్తకాల పేరుతో రూ.10 నుండి రూ.15వేల దాకా వసూలు చేస్తున్నారన్నారు. యూనిఫాం పేరుతో రూ.10వేలదాకావసూలు చేస్తున్నారన్నారు. దాంతోపాటు లక్షలకు పైగా ఫీజులు వసూలు చేస్తున్నారన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల నడ్డి విరుస్తున్నారని పేర్కొన్నారు. నారాయణ, చైతన్య, మాంటేశ్వరి, భాష్యం, శ్రీలక్ష్మి, కేశవరెడ్డి త దితర పాఠశాలలు బహిరంగంగా పుస్తకాలు యూనిఫామ్‌ల పేరుతో అధిక మొ త్తంలో వసూలు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే ఈ విద్యా సంస్థలపై తగు విచారణ చేపట్టి ఫీజుల దోపిడిని అరికట్టాలని కోరారు. సిటీ అధ్యక్షుడు అమర్, ఉపాధ్యక్షుడు నరసింహా, నాయకులు యోగి, పాల్గొన్నారు.

డాక్టర్ శంకర్‌శర్మను సన్మానిస్తున్న మీసాల సుమలత, మహిళలు

సమాజ సేవకుడు డాక్టర్ శంకర్‌శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

వైద్యంతో పాటు, సమాజ సేవకుడుగా ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు డాకర్ శంకశర్మ ఎన్నోసేవా కార్యక్రమాలు చేస్తున్నారని ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ మహిళ ఐక్యవేదిక కర్నూలు నగర అధ్యక్షురాలు మీసాల సుమలత అన్నారు. సోమవారం కర్నూలు నగరంలోని గాయత్రీ ఎస్టేట్ సద్గురు దత్త పాలి క్లినిక్‌లో సమాజ సేవకుడు, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ సీనియర్ వైద్యులు శంకర్ శర్మను శాలువా కప్పి పూల, బొకేతో సన్మానం చేశారు. దేవుడు తల్లితండ్రుల రూపంలో పిల్లలను జన్మనిస్తే వైద్యులు వారికి పునర్జన్మనిస్తారని అన్నారు.

వైసిపిది ప్రజా ప్రభుత్వం : ఎమ్మెల్యే శ్రీదేవి

ప్రజాశక్తి- తుగ్గలి

వైసిపి ప్రభుత్వం కేవలం ప్రజల కోసమే పని చేస్తుందని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. సోమవారం బొల్లవానిపల్లి గ్రామంలో గడపగడప మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి సమస్యను పరిష్కారం చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. రైతులు ఆత్మ హత్య చేసుకుంటే ఆ కుటుంబానికి రూ.7 లక్షలు అందించామన్నారు. జగనన్న సురక్ష పథకం ద్వారా ఇంటి దగ్గరకు సేవలను అందిస్తున్నామన్నారు. మాజీ జడ్‌పిటిసి జగన్నాథ్‌రెడ్డి ఎంపిపి అదెమ్మ, సర్పంచి సౌజన్య ,అధికారులు పాల్గొన్నారు.

భూమి ఎరువులతో పంటలకు ఉపశమనం : ఎఒ

ప్రజాశక్తి-సి బెళగల్

ప్రస్తుతం వర్షాభావ పరిస్థి తులు ఎదుర్కొంటున్న రైతులు భూమి మం దులతో పిచికారీ చేసుకోవడం వలన పంటలకు ఉపశమనం దొరుకు తోందని ఎఒ మల్లేష్ కుమార్ అన్నారు. సోమవారం గొల్లలదొడ్డి, బురాన్‌దొడ్డిలో పంట పొలాలను పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఏ పంటకైనా సరే ఎకరాకు 19-19-19 లేదా 13-0-45 ఎరువును లీటర్ కు 5 గ్రాములు చొప్పున నీటిలో కలుపుకొని పిచికారీ చేస్తే ప్రయోజనాలు ఉన్నాయన్నారు. వర్షాలు కూడా సమృద్ధిగా వచ్చే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

సమావేశంలో మాట్లాడుతున్న రాధాకృష్ణ

మహా పాదయాత్రను జయప్రదం చేయండి

- సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు రాధాకృష్ణ

ప్రజాశక్తి - ఆదోని

జిల్లా సమగ్రాభివృద్ధి కోసం సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి 31 వరకు నిర్వహించే మహా పాదయాత్రను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు పిఎస్.రాధాకృష్ణ కోరారు. సోమవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో ముక్కన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాధాకృష్ణ మాట్లాడారు. జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో తాగు, సాగునీటి కోసం ప్రాజెక్టులు నిర్మించాలని, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మెరుగైన విద్య, వైద్యం కోసం సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని కోరారు. జిల్లావ్యాప్తంగా స్థానిక సమస్యలపై సచివాలయాల్లో వినతిపత్రాలు ఇస్తామన్నారు. ఆదోని పట్టణంలో జనాభా రోజురోజుకు పెరుగుతోందని, అవసరాలకు అనుగుణంగా నీరు సరిపోవడం లేదన్నారు. ప్రస్తుతం ఉన్న ఎస్ఎస్ ట్యాంకుకు అదనంగా మరో సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు నిర్మించాలని కోరారు. సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మన్న, పట్టణ కమిటీ నాయకులు గోపాల్, తిప్పన్న, వీరేష్, వెంకటేష్, మునెప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

'కార్మికులకు పెండింగ్ వేతనాలివ్వాలి'

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలోని వివిధ గ్రామాల్లో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు 8 నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే ఇవ్వాలని సిఐటియు మండల కార్యదర్శి అశోక్, వ్యకాస మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాష డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ముందు స్వచ్ఛభారత్ కార్మిక సంఘం (సిఐటియు) ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. సిఐటియు మండల అధ్యక్షులు పాండు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రత కోసం క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న స్వచ్ఛభారత్ కార్మికులకు 8 నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. 8 నెలలుగా జీతాలు ఇవ్వకుంటే ఎలా బతకాలని, ఏం తినాలని ప్రశ్నించారు. పచ్చదనం, పరిశుభ్రత అనే గొప్ప, గొప్ప మాటలు చెప్పే పాలకులు క్షేత్రస్థాయిలో వాటిని అమలు చేస్తున్న కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేయడం దారుణమని మండిపడ్డారు. స్వచ్ఛభారత్ కార్మికులకు పెండింగ్ వేతనాలు ఇవ్వాలని, నెలనెలా జీతాలు ఇచ్చే పద్ధతిని తీసుకురావాలని కోరారు. కార్మికులకు బట్టలు, నూనెలు, సబ్బులు, పిఎఫ్ సౌకర్యం, ఇన్స్యూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛభారత్ కార్మికులు శాంతి రాజు, ఏసోబు పాల్గొన్నారు.

విత్తన షాపుల్లో అధికారుల తనిఖీలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్లలోని విత్తన దుకాణాల్లో ఎమ్మిగనూరు ఎడిఎ మహ్మద్ ఖాద్రీ, గోనెగండ్ల ఎఒ జి.హేమలత సోమవారం తనిఖీలు నిర్వహించారు. సుమారు రూ.10 లక్షల విలువ చేసే పత్తి, సజ్జ, కంది, మిరప విత్తనాలకు సంబంధించిన సోర్స్ సర్టిఫికెట్ లేకపోవడంతో వాటి అమ్మకాలను నిలుపుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వివిధ షాపుల్లో తనిఖీలు నిర్వహించి కిరణ్ హైబ్రిడ్ సీడ్స్ దుకాణంలో రూ.1,65,753, శ్రీభవాని ట్రేడర్స్‌లో రూ.4,17,250, లక్ష్మీనరసింహస్వామిలో రూ.4,08,592, జై కిసాన్ సీడ్స్ పెస్టిసైడ్స్‌లో రూ.63,975 విలువ చేసే వివిధ రకాల విత్తనాల అమ్మకాలను నిలిపివేసినట్లు తెలిపారు. సరైన పత్రాలు సమర్పించే వరకు స్టాప్ సేల్ విధించి అమ్మకాలు నిలిపినట్లు చెప్పారు. విత్తనాలను ఎంఆర్‌పి కంటే అధిక ధరలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డీలర్లు ప్రతినెలా 5లోపు క్రయవిక్రయాలకు సంబంధించిన వివరాలను తెలియజేయాలని అన్నారు.

23న బాడీ బిల్డర్ ఛాంపియన్‌షిప్ పోటీలు

ప్రజాశక్తి - ఆదోని

ఈనెల 23న పట్టణంలో జిల్లా బాడీ బిల్డర్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు టోర్నమెంట్ ఛైర్మన్ కునిగిరి నీలకంఠ తెలిపారు. సోమవారం పట్టణంలోని భీమాస్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఆవరణలోని ఆడిటోరియంలో మిస్టర్ కర్నూలు బెంచ్ ప్రెస్ కాంపిటీషన్ ఉదయం 9 నుంచి, ఉమ్మడి కర్నూలు జిల్లా బాడీ బిల్డర్స్ ఛాంపియన్‌షిప్ పోటీలు సాయంత్రం 5 గంటల నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. కర్నూలు జిల్లానే కాకుండా నంద్యాల నుంచి కూడా ఎక్కువ సంఖ్యలో ఉత్సాహవంతులైన యువకులు పాల్గొంటారన్నారు. గత 37 ఏళ్లుగా శ్రీహనుమాన్ వ్యాయామశాల జాపాల్లి బాడీ లైన్‌లో అనేక మంది యువకులు ట్రైనింగ్ తీసుకున్నారని తెలిపారు. సెక్రటరీ హనుమంతు, జాయింట్ సెక్రటరీ సాకారే శ్రీనివాసులు, వైస్ ప్రెసిడెంట్ మంజునాథ్, ట్రెజరర్ కామలే గోవిందు, జాయింట్ సెక్రటరీ రవీంద్ర, ఆర్గనైజర్ బి.లోకేష్ పాల్గొన్నారు.

ముఖం చాటేసిన వరుణుడు

- ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెల గడిచినా కురవని వర్షం
- ఈ ఏడాది గడ్డు పరిస్థితి తప్పదా అంటూ రైతుల ఆవేదన

ప్రజాశక్తి - ఆదోని

ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు గడిచినా నేల పదునయ్యే వర్షం రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రుతుపవనాల ప్రభావంపైనే ఆధారపడి వర్షాలు కురుస్తున్నాయి. గత నెల 3న కేరళలో రుతుపవనాలు తీరం దాటాయి. 8న ఆంధ్రప్రదేశ్‌లో రుతుపవనాలు ప్రవేశించాయని వాతావరణ శాఖ ప్రకటించింది. రుతుపవనాలు ప్రభావం చూపకపోవడంతో

విస్తారమైన వర్షం కురువని పరిస్థితి. అక్కడక్కడ మోస్తారు వర్షం కురిసినా నేల పూర్తిస్థాయిలో పదును కాలేదని రైతులు చెబుతున్నారు. ఇప్పటికీ వాతావరణం చల్లబడలేదు. వేసవిని తలపించే విధంగా వేడి గాలులు వీస్తున్నాయి. గతేడాదితో పోలిస్తే 10 శాతం కూడా విత్తనం నాటుకోలేదని రైతులు వాపోతున్నారు. ఈఏడాది గడ్డు పరిస్థితి తప్పదా అంటూ రైతులు తలలు పట్టుకుంటున్నారు.

అరకొరగానే వర్షపాతం

- ఆదోని డివిజన్‌లో 31.8 మిల్లీమీటర్ల వర్షపాతం

ఆదోని రెవెన్యూ డివిజన్‌లో సోమవారం తెల్లవారుజామున 31.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయిందని అధికారులు వెల్లడించారు. కోసిగి 14.4, మంత్రాలయం 9.8, గోనెగండ్ల 3.2, నందవరం 1.8, ఎమ్మిగనూరు 1.2, ఆదోని 0.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. డివిజన్ మొత్తంగా 31.8 మిల్లీమీటర్ల వర్షం కురిసి సగటున 3.5 మిల్లీమీటర్లు నమోదైంది.

బ్లాక్‌లో విత్తనం

ఆదోని పట్టణంలో కొందరు విత్తన వ్యాపారులు కృత్రిమ కొరత సృష్టిస్తున్నారు. బోరుబావుల కింద మిరప పంట మంచి దిగుబడి రావడంతో ఆ పంట సాగు చేసేందుకు రైతులు ఉత్సాహం చూపుతున్నారు. అవసరాన్ని గ్రహించిన వ్యాపారులు మిరప విత్తనాలు బ్లాక్‌లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. సింజంట కంపెనీ 10 గ్రాముల ప్యాకెట్ ఎంఆర్‌పి కన్నా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఒక్కో ప్యాకెట్ రూ.1800లకు విక్రయిస్తున్నారని, ఎలా సాగు చేసేదంటూ రైతులు వాపోతున్నారు. ఎకరాకు పది ప్యాకెట్లు అవసరమని రైతులు చెబుతున్నారు. స్టాక్ వివరాలను వ్యాపారులు బహిర్గతం చేయకుండా జాగ్రత్త పడుతూ విత్తనం లేదని బొంకుతున్నారు. సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పరిష్కరించే వారే కరువయ్యారని రైతులు ఆందోళన చెందుతున్నారు.

ఆచారాలను దెబ్బతీసేందుకే...

- ముస్లిం, మైనార్టీ మత పెద్దలు

ప్రజాశక్తి - ఆదోని

ముస్లిం పర్సనల్ లా, ముస్లింల ఆచారాలను దెబ్బ తీసేందుకే కేంద్ర ప్రభుత్వం యూనిఫామ్ సివిల్ కోడ్ (యుసిసి) చట్టం ప్రవేశ పెట్టబోతోందని ముస్లిం, మైనారిటీ మత పెద్దలు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం ఆదోని ఖాజి అల్తాఫ్ హుస్సేన్ ఇంటి నుంచి నిరసన ప్రారంభించారు. ఆదోనిలో ఉన్న మసీదుల ఇమాంలు, ముఖ్య నేతలతో అల్తాఫ్ హుస్సేన్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం యుసిసి చట్టాన్ని ప్రవేశపెట్టేందుకు సమాయత్తం అవుతోందని తెలిపారు. జూన్ 14 నుంచి జులై 14 వరకు కేంద్ర ప్రభుత్వం, లా కమిషన్ ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టిందని వివరించారు. యుసిసికి తాము ఎందుకు వ్యతిరేకమో కేంద్ర ప్రభుత్వానికి, లా కమిషన్‌కు పోస్టుల ద్వారా, ఈమెయిల్ ద్వారా వినతులు తెలిపే ఉద్యమానికి శ్రీకారం చుట్టామన్నారు. చట్టంతో తాము తీవ్రంగా నష్టపోతామని తెలిపారు.

వినతి పత్రాలను చూపుతున్న మత పెద్దలు

నిబంధనలు పాటించని ప్రయివేట్ స్కూల్

యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

- ఎంఇఒకు ఎస్ఎఫ్ఐ వినతి

ప్రజాశక్తి-ఆలూరు

నిబంధనలు పాటించని ప్రయివేట్ పాఠశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు కోరారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఎంఇఒ కోమల దేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పోతురాజు, అధ్యక్షులు లక్ష్మీనారాయణ మాట్లాడారు. ఆలూరులో సాయిశ్రీ పాఠశాల యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను శ్రీచైతన్య పేరుతో మభ్యపెట్టి రూ.వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. పాఠశాలలకు బస్సులు ఏర్పాటు చేయాల్సి ఉండగా, వివిధ గ్రామాల నుంచి పరిమితికి మించి ఆటోల్లో విద్యార్థులను పాఠశాలకు తీసుకొస్తున్నారని చెప్పారు. విద్యాహక్కు చట్టానికి విరుద్ధంగా పాఠశాల యాజమాన్యం వ్యవహరిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన వేళలు కాకుండా సాయంత్రం 4.30 గంటల వరకు పాఠశాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. సెయింట్ జాన్స్ పాఠశాల యాజమాన్యం కూడా బస్సుల్లో పరిమితికి మించి విద్యార్థులను గ్రామంలో నుంచి పాఠశాలకు తీసుకొస్తున్నారని తెలిపారు. ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు గోవర్ధన్, రవీంద్ర, ఎస్ఎఫ్ఐ మండల ఉపాధ్యక్షులు గిరి మూర్తి, ధనంజయ్, ఉమేష్ పాల్గొన్నారు.

ఎంఇఒ కోమలదేవికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షూస్ ఎక్స్ఛేంజ్ మేళా

ప్రజాశక్తి - చిప్పగిరి

మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా కానుక కింద బుక్కులు, యూనిఫారం, బ్యాగులు, బూట్లు సరఫరా చేసింది. వాటిని ఇటీవలే అన్ని పాఠశాలల విద్యార్థులకు పంపిణీ చేశారు. బూట్ల కొలతల్లో తేడాలు రావడంతో వాటిని వాపస్ తీసుకొని విద్యార్థుల పాదాల కొలతలకు సరిపడే విధంగా ఉండే బూట్లను తిరిగి ఇచ్చేందుకు సోమవారం స్థానిక మండల రీసోర్స్ కేంద్రంలో షూస్ ఎక్స్ఛేంజ్ మేళా నిర్వహించారు. మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల విద్యార్థులు తమకు సరిపోని బూట్లను ఎంఆర్‌సి కేంద్రంలో అప్పగించారు. విద్యార్థుల పాదాల కొలతలను తీసుకున్నారు. ప్రస్తుతం విద్యార్థుల నుంచి తీసుకున్న పాదాల కొలతలతో పాటు వారి నుంచి వాపసు తీసుకున్న బూట్లను జిల్లా కేంద్రానికి పంపనున్నట్లు ఎంఇఒ-2 బాలానాయుడు తెలిపారు. తాజాగా విద్యార్థుల నుంచి తీసుకున్న పాదాల కొలతలకు అనుగుణంగా సరిపడే బూట్లు జిల్లా కేంద్రం నుంచి వచ్చాక విద్యార్థులకు పంపిణీ చేస్తామని చెప్పారు.

బూట్లను పరిశీలిస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

తప్పుల తడకగా పంటల బీమా...

- ఎకరాకు రూ.15 వేల బీమా ఇవ్వాలి - రైతు సంఘం

ప్రజాశక్తి - కోసిగి రూరల్

గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం ప్రకటించిన పంటల బీమా జాబితా తప్పుల తడకగా ఉందని, దీనిని సవరించి గత ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.15 వేల పంటల బీమా ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కమిటీ నాయకులు కె.వీరేష్, పూజారి శ్రీనివాసులు, కె.రాముడు సోమవారం ఓ ప్రకటనలో కోరారు. ప్రభుత్వం ప్రకటించిన పంటల బీమా జాబితా రైతులకు ఏమాత్రం ఉపయోగపడని పద్ధతిలో ఉందని తెలిపారు. కేవలం మొక్కుబడిగా ఇన్స్యూరెన్స్ కంపెనీలు, ప్రభుత్వం పంటల బీమాను విడుదల చేసి చేతులు దులుపుకున్నాయని విమర్శించారు. చాలా పంటలకు కూడా బీమా రాలేదని, ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నా పంటల బీమా వర్తింపజేయకుంటే రైతు మునగడ కష్టమవుతుందని తెలిపారు. ఇప్పటికే వ్యవసాయం భారమై రైతులంతా కూలీలుగా మారుతున్నారన్నారు. కనీస మద్దతు ధర లేదని, పెరుగుతున్న విత్తనాలు, మందులు, ఎరువులు ధరలు, కల్తీ విత్తనాలు, ఎరువులు, అధిక పెట్టుబడులతో వ్యవసాయ రంగం నానాటికీ కుదేలవుతోందని, ఆదుకోవాల్సిన ప్రభుత్వాలు చేతులెత్తేస్తున్నాయని విమర్శించారు. ప్రభుత్వం ప్రకటించిన పంటల బీమా పథకంపై పునరాలోచించి ఎకరాకు రూ.15 వేల పంటల బీమా వర్తింపజేయాలని కోరారు.

పత్తికి పంటల బీమా ఇవ్వాలి

- పందికోన రిజర్వాయర్ నుంచి కుడికాలువకు నీరు వదలాలి
- సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా

ప్రజాశక్తి- దేవనకొండ

గత ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల వల్ల దిగుబడుల్లేక నష్టపోయిన పత్తి రైతులందరికీ బీమా పథకం వర్తింపజేయాలని సిపిఎం జిల్లా నాయకులు బి.వీరశేఖర్, మండల నాయకులు అశోక్ డిమాండ్ చేశారు. ప్రస్తుతం వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పందికోన రిజర్వాయర్ నుంచి కుడి కాలువలకు నీరు వదలాలని కోరారు. సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు. సిపిఎం మండల నాయకులు యూసుఫ్ బాష అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా అన్ని మండలాల్లో పత్తి పంటకు బీమా వర్తింపజేసి కేవలం 5, 6 మండలాలకు పంటల బీమా వర్తింపజేయకపోవడం దుర్మార్గమన్నారు. మండలంలో పత్తి పంటను చాలా విస్తారంగా పండిస్తారని, పెట్టుబడులు కూడా భారీగా పెట్టారని తెలిపారు. గతేడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో సరైన సమయంలో వర్షాలు కురవక పత్తి పంట తీవ్రంగా దెబ్బతిందని, దిగుబడి అరకొరగా వచ్చిందని

తహశీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న సిపిఎం నాయకులు

పేర్కొన్నారు. పత్తి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. పంటల బీమా పథకాన్ని అస్తవ్యస్తంగా, తప్పులతడకగా మార్చిందని తెలిపారు. దీనిని వెంటనే సరిచేసి రైతులకు న్యాయం చేయాలని, పత్తి రైతులకు ఎకరాకు రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పందికోన రిజర్వాయర్‌లో నీళ్లు ఉన్నాయని, ఇప్పటికే ఎడమ కాలువకు నీరు వదులుతున్నారని, కుడికాలువకు కూడా నీరు వదలాలని కోరారు. తద్వారా కొంతమంది రైతులైన కరువు బారి నుంచి పంటలను కాపాడుకోవచ్చని పేర్కొన్నారు. వెంటనే నీరు వదిలి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సిపిఎం మండల నాయకులు పాండు, వెంకటేష్ ఆచారి, కార్యకర్తలు రంగడు, మహేష్, రంగస్వామి, రంగన్న, శాంతిరాజు, రామాంజనేయులు పాల్గొన్నారు.

పోస్టుకార్డులతో వినతి పంపుతున్న నాయకులు

'హోళగుంద, ధణాపురం రోడ్డు వేయాలి'

ప్రజాశక్తి - హోళగుంద

ధణాపురం నుంచి హోళగుంద వరకు రోడ్డు వేయాలని నాయకులు కోరారు. సోమవారం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి హోళగుంద జెఎసి కమిటీ సభ్యులు 5 వేల పోస్టు కార్డులతో వినతి పంపారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, విద్యార్థులు, మహిళలు రోడ్డు కోసం పడుతున్న కష్టాన్ని కార్డులో వివరించి, త్వరగా ధణాపురం నుంచి హోళగుంద వరకు వేయాలని జగన్మోహన్ రెడ్డిని కోరారు.

ప్రయివేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలి : పిఎస్‌యు

నందవరం : మౌలిక సదుపాయాలు కల్పించకుండా అధిక ఫీజులను వసూలు చేస్తున్న ప్రయివేట్ పాఠశాలల గుర్తింపు రద్దు చేయాలని పిఎస్‌యు నాయకులు కోరారు. సోమవారం స్పందనలో తహశీల్దార్ నిత్యానందరాజుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పిఎస్‌యు జిల్లా కార్యదర్శి సురేష్ మాట్లాడారు. మండలంలోని రెయిన్‌బో, సరస్వతి విద్యాపీఠం, ఉషోదయ ప్రయివేట్ పాఠశాలలు అక్రమంగా ఫీజులు, డొనేషన్ల పేరుతో వసూలు చేస్తున్నాయని తెలిపారు. ఇలాంటి పాఠశాలలపై చర్యలు తీసుకుని గుర్తింపు రద్దు చేయాలని కోరారు. పిఎస్‌యు నాయకులు కె.పాల్, మనోహర్ పాల్గొన్నారు.

ఎంఇఒగా రామాంజనేయులు

గోనెగండ్ల : గోనెగండ్ల ఎంఇఒ-1గా జి.రామాంజనేయులు సోమవారం మండల విద్యావనరుల కేంద్రంలో విధుల్లో చేరారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యాశాఖలో ప్రతి మండలానికీ ఇద్దరు ఎంఇఒలను ఇటీవలే నియమించింది. కొద్దిరోజుల క్రితమే ఎంఇఒ-2గా పాఠశాలల ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న వారికి పదోన్నతి కల్పించగా వారు విధుల్లో చేరారు. ఎంఇఒ-1గా ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించడంతో ఆలూరు ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేస్తున్న రామాంజనేయులు గోనెగండ్ల ఎంఇఒ-1గా నియమితులయ్యారు.

వైభవంగా గురు పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో గురు పౌర్ణమి వేడుకలను వైభవంగా నిర్వహించారు. సోమవారం గురు పౌర్ణమి సందర్భంగా శ్రీమఠం పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థుల ఆధ్వర్యంలో స్వామి వారి బృందావనానికి పంచామృతాభిషేకం, తులసి అర్చన వంటి పూజలతో మంగళ హారతులు ఇచ్చారు. అనంతరం బృందావనాన్ని స్వర్ణకవచాలతో, పట్టువస్త్రాలతో, వివిధ పుష్ప హారాలతో అలంకరించారు. రాఘవేంద్రస్వామి ఆరాధ్య దైవమైన మూల రాములకు విశిష్ట పూజలు నిర్వహించారు. రాఘవేంద్రుని బృందావనాన్ని దర్శించుకుని నైవేద్య సమర్పణతో మంగళ హారతులు ఇచ్చారు.

శ్రీమఠంలో గురువందన సమర్పణ

- టిటిడి దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో పీఠాధిపతులకు పుష్పాభిషేకం

పీఠాధిపతులను సన్మానిస్తున్న దాస సాహిత్య ప్రాజెక్టు

శ్రీమఠంలో గురు పౌర్ణమి సందర్భంగా టిటిడి దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులకు పుష్పాభిషేకం నిర్వహించారు. గురు వందన కార్యక్రమంలో భాగంగా టిటిడి దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీపగడాల ఆనందతీర్థాచార్ నేతృత్వంలో పండితుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం ఊయల మండపంలో పుష్పాభిషేకం నిర్వహించారు. **ఆస్పరిలో** వెలసిన శ్రీసాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. బాబాను దర్శించుకోవడానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ముందుగా సాయిరుత్విక్ సంజీవ రెడ్డి ఆధ్వర్యంలో సాయిబాబాకు కాకడ హారతి, సుప్రభాతం, అభిషేకం, సత్యవ్రతం, సాయి స్తోత్రం నిర్వహించారు. మధ్యాహ్నం బాబా చిత్రపటాన్ని టాటా ఏస్ వాహనంలో ఉంచి పురవీధుల గూండా ఊరేగింపుగా తీసుకెళ్లారు. టిడిపి ఆలూరు మాజీ ఇన్‌ఛార్జీ వీరభద్ర గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆస్పరిలో...

ప్రతిభను ప్రోత్సహిస్తే రాణింపు : సిఐ

- 'పది'లో ప్రతిభ చూపిన గ్రామీణ విద్యార్థులకు ప్రోత్సాహం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ప్రతిభావంతులైన గ్రామీణ విద్యార్థులను ప్రోత్సహించడం ద్వారా వారు మరింత ఉన్నత స్థానాలను చేరుకుంటారని ఎమ్మిగనూరు రూరల్ సిఐ కె.మోహన్ రెడ్డి తెలిపారు. సోమవారం నియోజకవర్గ పరిధిలోని మూడు మండలాల్లో పదో తరగతిలో ప్రతిభ చాటిన గ్రామీణ విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేశారు. మండలంలోని బనవాసి ఎపిఆర్ఎస్ గురుకుల పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పదో తరగతిలో సత్తాచాటి మొదటి మూడు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు వరుసగా రూ.5 వేలు, రూ.3 వేలు, రూ.2 వేల నగదు, గోల్డ్ మెడల్‌తో పాటు మెమొంటోలు అందజేశారు. మెరికల్లాంటి విద్యార్థులను తీర్చిదిద్దిన ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడారు. విద్యార్థులు కఠోర దీక్ష, నిరంతర సాధనను అలవర్చుకుని చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ అరుణ, రూరల్ ఎస్ఐ నిరంజన్ రెడ్డి, పోలీసులు చంద్ర, సుధాకర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందజేస్తున్న సిఐ

స్థానిక సమస్యలను పరిష్కరించండి : సిపిఎం

ప్రజాశక్తి - ఆలూరు

ఆలూరులోని తాగునీరు, డ్రెయినేజీ సమస్యలను పరిష్కరించాలని సిపిఎం సీనియర్ నాయకులు కెపి.నారాయణస్వామి కోరారు. సోమవారం స్థానిక సమస్యలపై గ్రామ పంచాయతీ కార్యదర్శి కృష్ణకుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సమస్యలతో ఆలూరు అభివృద్ధి కుంటుపడుతోందని తెలిపారు. గ్రామంలో తాగునీరు 10 రోజులకోసారి వస్తున్నాయని, డ్రెయినేజీ ఎక్కడకక్కడే నిలిచి అపరిశుభ్రంగా ఉందని చెప్పారు. సిద్ధేశ్వర కాలనీలో, సిపిఎం కొట్టాలలో వీధి స్తంభాలు ఏర్పాటు చేసి లైట్లు వేయాలన్నారు. సంత మార్కెట్ షాపింగ్ కాంప్లెక్స్‌ను ప్రారంభించి పంచాయతీ అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయం ముందు, ఆదోనికి వెళ్లే దారిలో ఆంజనేయస్వామి విగ్రహం ఆవరణలో తాత్కాలిక బిటి రోడ్డు వేయాలని తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి షాకీర్, శేఖర్, మైనా, గోవర్ధన్ పాల్గొన్నారు.

శ్రీమఠంలో ఘనంగా మృత్తికా సంగ్రహణ

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన శ్రీరాఘవేంద్రస్వామి మఠంలో మృత్తికా సంగ్రహణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం ఆషాడ శుద్ధ పూర్ణిమ సందర్భంగా మృత్తికా సంగ్రహణ మహోత్సవం నిర్వహించారు. పీఠాధిపతులు శ్రీసుభుదేంద్రతీర్థులు ఆధ్వర్యంలో రాఘవేంద్రస్వామి సన్నిధిలో పండితుల వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ శ్రీమఠం వరకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. పవిత్ర తుంగభద్ర నది తీరంలో తులసీ వనంలో విశేష పూజలు నిర్వహించారు. అక్కడి మృత్తిక (మట్టి)ను పళ్లెంలో ఉంచి స్వర్ణ పల్లకిలో ఉంచి మృత్తికను సేకరించారు. అనంతరం శ్రీరాఘవేంద్ర స్వామి మూల బృందావనం వద్ద నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గతంలో బృందావనంపై ఉంచిన మృత్తికను తొలగించి పౌర్ణమి సందర్భంగా సేకరించిన మృత్తికను ఉంచి మంగళ హారతులు ఇచ్చారు. శ్రీమఠం మేనేజర్లు ఎస్.కె.శ్రీనివాసరావు, వెంకటేష జోషి, ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీపతి ఆచార్, సహాయక పిఆర్‌ఒ హొన్నొళ్లి వ్యాసరాజాచార్ పాల్గొన్నారు.

హంద్రీనీవా ద్వారా నీరిచ్చే దాకా పోరాటం

- హంద్రీనీవా పెండింగ్ పనుల పూర్తి కోసం పాదయాత్ర - సిపిఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య

ప్రజాశక్తి - దేవనకొండ

హంద్రీనీవా ప్రాజెక్టు ద్వారా చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు ఇచ్చేదాకా పోరాటం కొనసాగిస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె.మద్దిలేటి శెట్టి తెలిపారు. సోమవారం సిపిఐ మండల కార్యదర్శి ఎం.నరసారావు ఆధ్వర్యంలో హంద్రీనీవా పెండింగ్ పనుల పూర్తి కోసం మండలంలోని నేలతలమర్రి గ్రామం నుంచి దేవనకొండ వరకు పాదయాత్ర నిర్వహించారు. పాదయాత్ర ముగింపు సభ బస్టాండ్ ప్రాంతంలో జరిగింది. సిపిఎం నాయకులు యూసుఫ్, అశోక్ సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులు బి.గిడ్డయ్య, కె.మద్దిలేటి శెట్టి మాట్లాడారు. హంద్రీనీవా సుజల స్రవంతి పథకం ద్వారా జిల్లాలో 86 వేల ఎకరాలకు సాగునీరు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. దేవనకొండ మండలానికే 45 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించాల్సిన లక్ష్యం నేటికీ నెరవేర్చడంలో పాలక ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. మండలంలో ఉన్న చెరువులన్నింటినీ హంద్రీనీవా నీటితో నింపాలని డిమాండ్ చేశారు. హంద్రీనీవా ఆయకట్టు స్థిరీకరణ పనులు పూర్తి చేసి మండల రైతులకు సాగునీరు, వివిధ గ్రామాల ప్రజలకు తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. సిపిఐ పట్టణ కార్యదర్శి వడ్డె రాజశేఖర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు విరుపాక్షి, సిపిఐ జిల్లా సమితి సభ్యులు భూపేష్, నాగేంద్రయ్య, ఆలూరు మండల కార్యదర్శి రామాంజి, రైతు సంఘం సీనియర్ నాయకులు యాటకల్లు ఆంజనేయ, కండప్ప, తిమ్మప్ప, బాలాజీ, సిపిఐ మండల సహాయ కార్యదర్శులు వెంకటేశ్వర్లు, నరసింహులు, నల్లచెలిమల శాఖ కార్యదర్శి బజారి, గుడిమరల శాఖ కార్యదర్శి తుకారాం, కోటకొండ శాఖ కార్యదర్శి హరిశ్చంద్ర, పాలకుర్తి శాఖ కార్యదర్శి అశ్వత్థామ, కరివేముల శాఖ కార్యదర్శి నరసింహులు, కుంకనూరు శాఖ కార్యదర్శి గోపాల్, ఎఐఎస్ఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు మధు, భాస్కర్, ఎఐవైఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు పరమేష్, రమేష్, హమలీ యూనియన్ నాయకులు దస్తగిరి, రమేష్, నాగరాజు, ఆటో యూనియన్ నాయకులు బడేసాహెబ్, వెంకటేష్, కార్పెంటర్స్ యూనియన్ నాయకులు సుల్తాన్, సాహెబ్, టైలర్స్ యూనియన్ నాయకులు ప్రసాద్, బాషా, రామాంజనేయులు, కోమేష్, వీరేష్ పాల్గొన్నారు.

IN THE COURT OF THE 2nd ADDITIONAL DISTRICT JUDGE:: KURNOOL AT ADONI
O.S.NO. 13/2021

BETWEEN:
S. Krishna Veni @ Geetha. ...Plaintiff
...Vs...
S.Rama Chandra Rao and others. ...Defendants
To:
D9. Indira Bai
D/o. Late Gopal Rao,
W/o. Late J. Malla Rao,
Hindu, aged about 84 years,
R/o. H.No.-22-3A,
Near Good Shepherd School,
Balaji Nagar, Kurnool

The above-named Plaintiff has filed the above suit for partition. The case is now posted for appearance of you on 07/08/2023. You are hereby directed to appear in person or through your pleader on the aforesaid date at 10:30 A.M., failing which you will be set ex-parte

Sri T.NAGARAJ,
Sri T.Madhu Sudhan,
Advocate, adoni.

మహారాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి,కదిరి
O.S.NO:622/2019

Between:
ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు, Kadiri Main Branch వారు rep by its senior manager. Kadiri,
...Plaintiff
మరియు
D2: S.రామలింగా రెడ్డి S/o S.నారాయణరెడ్డి, Now R/at ఊరుకుంద Near ఆదోని,కర్నూలు జిల్లా.
...Defendants

పై దావాలోని D2 ప్రతివాదికి దావా సమన్లు

పై దావాలోని వాది (ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంకు Kadiri Main Branch వారు) ప్రతివాదులు D2 అయిన మీ పైన బ్యాంకుకు రావలసిన లోను మొత్తం రాబట్టుకొనుటకు పై కోర్టులో దావా వేసి యున్నారు. పై దావాను ఘనమైన కోర్టు వారు 14/07/2023 వ తేదిన మీ హాజరు నిమిత్తం వాయిదా వేసినారు. కావున మీరు 14/07/2023 వ తేదిన ఉదయం 10:30 గంటలకు స్వయముగా కానీ లేదా వకీలు ద్వారా గానీ హాజరై ఆక్షేపనులు ఉన్న యెడల తెలుపుకొనవలెను. లేనిచో ఘనమైన కోర్టువారు పై దావాను మీ పరోక్షముగా తీర్మానించెదరు.

(కోర్టు వారి ఉత్తర్వు మేరకు)

వాయిద 14/07/2023
జి.గురులింగస్వామి,బి.ఎ.,బి.ఎల్
వాదితరుపు వకీలు, కదిరి

IN THE COURT OF SPECIAL JUDICIAL MAGISTRATE OF I CLASS PROH & EXCISE :: KURNOOL
D.V.C. No. 80/2021

Kodumur Janaki w/o Ravi Kumar Yadav,
R/O H.No. 11-139-2, Padakhana Street,
Gudur Village & Mandal, Kurnool District.
...Petitioner
Vs
1. Kodumur Ravi Kumar Yadav s/o Maddilety, aged about 33 years,
2. Kodumur Lakshmi Devi w/o Maddilety, aged about 55 years,
3. Kodumur Maddilety s/o Naganna, aged about 60 years,
4. Y. Sujatha w/o Sudhakar, aged about 42 years,
5. Y. Sudhakar s/o not known, aged about 45 years,
6. Manjula w/o Mallikarjuna, aged about 38 years,

All are Hindus, R/o H.No.2-45, Pyalakurthy Village, Kodumur Mandal, Kurnool District.

Summons

Where as the Petitioner filed the above case against the respondents 1 to 6 and others seeking certain reliefs under DVC Act, you the respondents 1 to 6 hereby directed to appear before this Hon'ble Court or appear through an Advocate on your behalf to file your counters and for trail with documents on 26-07-2023 at 10.30 A.M. without fail otherwise the matter will be settled, in your absence, by this Hon'ble Court.

K.UMA HANUMANTHA RAO,
ADVOCATE

IN THE COURT OF THE VIII JUNIOR CIVIL JUDGE: CITY CIVIL COURT AT: HYDERABAD
O.S. No. 4717 of 2021

Between:-
Union Bank of India
[A Govt. of India undertaking]
[Formerly] Andhra Bank,
Credit Card Division, Koti,
Hyderabad, rep.by its Sr.Manager(Law) &Authorized Officer,
...Plaintiff
And
Sri.S.Raghavendra,
...Defendant
To
Sri.S.Raghavendra, S/o.S.Nukaiah,
Aged about 66 Years, Occ: Employee,
R/o. H.No.17/44/A, Subbaraopeta,
Nandikotkur, Kurnool-518301.
&
H.No.16-513, Parvathapuram (Vill), Adoni Mandal, Kurnool District, A.P-518301.

Take Notice that the above mentioned Suit is filed against you for recovery of a sum of Rs.2,21,819-47ps towards utilization of Credit card. The above mentioned Suit is posted for your appearance on 14-07-2023.

In case of your failure to attend before the Court on 14-07-2023 at 10-30 A.M. either in person or through a Counsel the matter will be decided in your absence by setting you exparte.

(BY ORDER OF THE COURT)
T. Bhagya Raju & Associate Advocates,
Counsel for the Plaintiff,
Flat No.402, Nirmal Ratna Aprts, Opp: R.S.Brothers, Chandanagar, Gangaram Village, HYDERABAD-50.

స్పందన కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

10, 11న కలెక్టరేట్ ఎదుట 36 గంటల ధర్నా

- జయప్రదం చేయాలని వాల్ పోస్టర్ విడుదల
- సిఐటియు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు

ప్రజాశక్తి - నంద్యాల

ఐసిడిఎస్ పథకానికి నిధుల కేటాయింపు పెంచాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఈ నెల 10, 11వ తేదీల్లో జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద 36 గంటల పాటు ధర్నా నిర్వహిస్తున్నట్లు సిఐటియు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు తెలిపారు. 36 గంటల ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి.ఏసురత్నం, ఎ.నాగరాజు, ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నిర్మలమ్మ మాట్లాడారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పిల్లలు, గర్భిణులకు, బాలింతలకు ఉపయోగపడే పథకాన్ని క్రమంగా దూరం చేసే ప్రయత్నం చేస్తుందని అన్నారు. గర్భిణులకు, పిల్లలకు, బాలింతలకు డబ్బుల కేటాయింపులు పెంచాలని, అంగన్వాడీ విద్యను బలోపేతం చేయాలన్నారు. పిల్లలకు యూనిఫామ్, అమ్మఒడి అమలు చేయాలని కోరారు. గర్భిణి, బాలింతలకు ఇస్తున్న రేషన్, ఆయిల్ ఇతర సరుకుల చార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. నాణ్యమైన ఆహారం అరఫరా చేయాలని, ప్రతి నెలా ఒక గ్యాస్ సిలిండర్ ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. సెంటర్లలో వంట చేయటానికి గ్యాస్ పొయ్యిలు, వంట పాత్రలు సరఫరా చేయాలని కోరారు. తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు పెంచాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని, సర్వీసులో ఉండి చనిపోయిన కుటుంబాలలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంగన్వాడీ ఉద్యోగులకు కనీసం వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని తదితర సమస్యలపై ఈ నెల 10, 11వ తేదీలలో కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే 36 గంటల ధర్నాలో జిల్లాలోని అంగన్వాడీ టీచర్లు, ఆయాలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అనంతరం 36 గంటల ధర్నా వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి వి.బాల వెంకట్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు డి.నిర్మలమ్మ, వెంకటలక్ష్మి, సునీత శైలజ, నాగలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు, కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

36 గంటల ధర్నా వాల్ పోస్టర్లు విడుదల చేస్తున్న సిఐటియు, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేతలు వి.ఏసురత్నం, ఎ.నాగరాజు, ఎం.నిర్మల

స్పందన అర్జీలకు సత్వర పరిష్కారం

- జగనన్న సురక్ష పెండింగ్ సర్వీస్ రిక్వెస్ట్‌లను క్లియర్ చేయండి
- జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలను సత్వరమే నాణ్యతతో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో ప్రజా ఫిర్యాదుల స్వీకరణ స్పందన కార్యక్రమం నిర్వహించారు. కలెక్టరుతో పాటు జాయింట్ కలెక్టర్ నిశాంతి.టి, డిఆర్వో పుల్లయ్య తదితర జిల్లాధికారులు పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్షకు సంబంధించి పెండింగ్‌లో వున్న సర్వీస్ రిక్వెస్ట్‌లను వెంటనే క్లియర్ చేసి నివేదికలను అప్లోడ్ చేయాలని నియోజకవర్గ అధికారులకు, సంబంధిత మండల అధికారులకు సూచించారు. చాగలమర్రి, దొర్నిపాడు, రుద్రవరం, సిరివెళ్ల, బనగానపల్లి, బేతంచర్ల, అవుకు తదితర మండలాల్లో సర్వీస్ రిక్వెస్టులు అధికంగా పెండింగ్ ఉన్నాయని, వెంటనే క్లియర్ చేయాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు సంబంధిత అధికారులు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ దరఖాస్తులు, బియాండ్ ఎస్ఎల్ఏ, రీ ఓపెనింగ్ లేకుండా పరిష్కరించాలన్నారు. స్పందన కార్యక్రమం అనంతరం డెంగ్యూ నివారణ మాసోత్సవం పోస్టర్లను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, ఇతర అధికారులు ఆవిష్కరించారు.

జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి

జెసి నిశాంతి బదిలీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ బాధ్యతలను జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సామూన్‌కు అప్పగిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అయితే జెసి టి.నిశాంతికి ఎక్కడ పోస్టింగ్ ఇవ్వలేదు. సాధారణ పరిపాలన విభాగంలో రిపోర్ట్ చేయాలని చీఫ్ సెక్రటరీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. జెసిగా టి.నిశాంతి నంద్యాల జిల్లాకు వచ్చి ఎనిమిది నెలలు కూడా గడవకముందే బదిలీ చేయడంపై సర్వత్రా చర్చ నెలకొంది. ఇటీవల కాలంలో జెసిపై పలు ఆరోపణలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఆమెను బదిలీ చేసి ఉండవచ్చని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

ఎస్ఐ, కానిస్టేబుల్ అభ్యర్థులకు

ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలి : డివైఎఫ్ఐ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన ఎస్సై, కానిస్టేబుల్ అభ్యర్థులకు తక్షణమే ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి శివ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టర్‌కు నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రిలిమ్స్ పరీక్షలు జనవరి చివరిలో నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికల ముందు రాష్ట్ర ప్రభుత్వం హడావిడి చేసిందని, ఎన్నికలు ముగియగానే నిరుద్యోగులను, ముఖ్యంగా ఎస్సై, కానిస్టేబుల్ ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన అభ్యర్థులకు ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని తెలిపారు. దీని ఫలితంగా ముందే నిరుద్యోగంతో బాధపడుతున్న లక్షలాదిమంది ప్రతి నెలా 8 నుండి 10 వేల రూపాయలు రూమ్ బాడుగలు, హాస్టల్, మెస్, స్టడీ హాల్స్‌కి ఖర్చు పెట్టుకోవాల్సిన దుర్భర పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి ఫిజికల్ ఈవెంట్స్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా డివైఎఫ్ఐ పెద్దఎత్తున ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకులు వినీత్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న డివైఎఫ్ఐ నాయకులు

వైభవంగా శాకాంబరీ ఉత్సవం

ప్రజాశక్తి - శ్రీశైలం

ఆశాడ పౌర్ణమి పురస్కరించుకొని శ్రీశైల క్షేత్రంలోని భ్రమరాంబ దేవి అమ్మవారికి సోమవారం శాకాంబరీ ఉత్సవాన్ని దేవస్థానం వారు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో వివిధ రకాల పండ్లు, ఆకుకూరలతో అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించారు. అలాగే ఆలయ ప్రాంగణాన్ని అంతా పండ్లు, ఆకుకూరలతో అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో ఉన్న రాజరాజేశ్వరి అమ్మవారికి, అన్నపూర్ణాదేవి అమ్మవారికి, గ్రామదేవత అంకాలమ్మకు వివిధ రకాల పండ్లు, ఆకుకూరలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి లవన్న, ఉభయ దేవాలయాల ప్రధానార్చకులు వేద పండితులు పాల్గొన్నారు. శాకాంబరీ ఉత్సవం సందర్భంగా క్షేత్రంలోని భ్రమరాంబ మల్లికార్జున స్వామి వార్లను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. ఉచిత, శీఘ్ర, అతి శీఘ్ర క్యూలైన్‌లు భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. క్యూలైన్లో భక్తులకు కావాల్సిన అన్ని ఏర్పాట్లు దేవస్థానం వారు చేశారు. అలాగే గురు పౌర్ణమి పురస్కరించుకొని శ్రీశైలం దేవస్థానం ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అక్క మహాదేవి, హేమారెడ్డి మల్లమ్మ మందిరంల వద్ద, దక్షిణామూర్తి స్వామి వారికి, వ్యాస మహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇఒ లవన్న మాట్లాడుతూ ఒకే వేదంగా ఉన్న వేదాన్ని నాలుగు భాగాలుగా విభజించి రచించి ప్రజలకు తెలియజేసిన ఘనత వ్యాస మహర్షికే దక్కిందని అన్నారు.

గో సంరక్షణ నిధికి విరాళం : గోవులను సంరక్షించేందుకు దేవస్థానం ఏర్పాటు చేసిన గో సంరక్షణ నిధికి తెలంగాణ రాష్ట్రం ఖమ్మం నివాసులైన సత్యాలు జోష్ణ రూ.1,00,111 విరాళంగా దేవస్థానానికి అందజేశారు. దాతలకు స్వామి వారి శేష వస్త్రాలను, ప్రసాదాలను దేవస్థానం అధికారులు అందజేశారు.

మహానంది క్షేత్రంలో శాకాంబరీ ఉత్సవం

మహానంది : గురుపౌర్ణమి సందర్భంగా మహానంది క్షేత్రంలోని అమ్మవారు శాకాంబరీ అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. తెల్లారు జామున ముందుగా కామేశ్వరి అమ్మవారికి వివిధ రకాల పండ్లు, శాకాలతో అలంకరించారు. అమ్మవారి ఆలయ మండపాలకు సుందరంగా కూరగాయలతో తోరణాలు కట్టారు. అనంతరం ఆలయ కార్యనిర్వహణాధికారి చంద్రశేఖర్ రెడ్డి, ధర్మకర్తలు, దాతలు ప్రసాద్, ఆదిలక్ష్మమ్మ దంపతులు కూరగాయలతో ప్రదక్షిణంగా ఆలయంలోకి వచ్చి మహానందీశ్వరునికి అష్టోత్తర పూజ చేసిన అనంతరం అమ్మవారికి శాస్త్రీయంగా సహస్ర శాకార్చన, అలంకార హారతులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వేదపండితులు, పాలక మండలి సభ్యులు, దాతలు, గ్రామస్తులు, భక్తులు పాల్గొన్నారు.

శాకాంబరీ అలంకరణలో భ్రమరాంబ దేవి అమ్మవారు

24 మండలాల్లో వర్షపాతం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లాలో అక్కడక్కడ వర్షం కురిసింది. 29 మండలాలకు గాను 24 మండలాల్లో వర్షపాతం నమోదైంది. జిల్లా వ్యాప్తంగా 16.0 మి.మీ వర్షపాతం నమోదు కాగా అత్యధికంగా బండి ఆత్మకూరు మండలంలో 61.0, అత్యల్పంగా జూపాడుబంగ్లా 2.6 మి.మీ నమోదైంది. సిరివెళ్ల 42.8, బేతంచెర్ల 40.2, గడివేముల 33.4, వెలుగోడు 31.2, రుద్రవరం 30.8, ఆత్మకూరు 23.2, కొత్తపల్లి, మహానంది 20.2, గోస్పాడు 18.0 నంద్యాల 17.4, దొర్నిపాడు 16.4, పాణ్యం 16.0, కొలిమిగుండ్ల 14.0, పాములపాడు 12.8, చాగలమర్రి 12.0, బనగానపల్లె 11.2, ఆళ్లగడ్డ 9.2, సంజామల 7.0, కోయిలకుంట్ల, ఉయ్యాలవాడ 6.8, మిడ్తూరు 6.2, అవుకు 3.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రా రెడ్డి

పేదల సంక్షేమమే ధ్యేయం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ : పేద ప్రజల సంక్షేమమే వైసిపి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మర్రిపల్లే గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం పేదప్రజలకు అండగా నిలబడి అనేక సంక్షేమ పథకాలను అందిస్తోందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి గజ్జల రాఘవేంద్ర రెడ్డి, ఆళ్ళగడ్డ టౌన్ కన్వీనర్ గొట్లూరు సుధాకర్ రెడ్డి, మర్రిపల్లె సర్పంచి తులసీశ్వర్ రెడ్డి, ఆర్.కృష్ణాపురం వైసిపి నాయకులు రామకృష్ణ రెడ్డి, జగన్ మోహన్ రెడ్డి, రంగారెడ్డి, గోపిరెడ్డి అశోక్ రెడ్డి, సోషల్ మీడియా కన్వీనర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేతనాలు పెంచాలి : ఎఐటియుసి

ప్రజాశక్తి - నంద్యాల అర్బన్ : నంద్యాల పట్టణంలోని శానిటేషన్ కార్మికులకు, స్వీపర్స్‌కు వేతనాలు పెంచాలని ఎఐటియుసి జిల్లా సెక్రటరీ డి.శివ బాలకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద ఏఐటియుసి ఆధ్వర్యంలో కార్మికులు ధర్నా చేపట్టారు. ఈ ధర్నాకు పట్టణ అధ్యక్షులు భూమని శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు సిఎం ప్రకటించిన జీవో 549 ప్రకారం రూ.16 వేలు ఇవ్వాలని, వీరిని అప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సుబ్బయ్య, కార్మికులు ఈశ్వరమ్మ, పెంచలమ్మ, సలామీ, సరళమ్మ, సుబ్బమ్మ, మేరీ, మద్దమ్మ, లక్ష్మీదేవమ్మ, లచ్చుమ్మ, చిన్న మేరి, మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

దశదిన కర్మలకు ఆర్థికసాయం

ప్రజాశక్తి - సంజామల : మండలంలోని గిద్దలూరు గ్రామానికి చెందిన మాల బెల్లం జయరాజు అనారోగ్యంతో ఇటీవల మరణించడంతో దశదినకర్మలకు ఆయన కుటుంబానికి భక్తుల ప్రతాప్ రెడ్డి రూ. 5 వేలు నగదు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ కీర్తిశేషులు భక్తుల వెంకటసుబ్బమ్మ జ్ఞాపకార్థం జయరాజు కుమారుడికి ఆర్థికసాయం అందజేశామన్నారు.

జయరాజు కుమారునికి రూ.5 వేలు అందజేస్తున్న ప్రతాపరెడ్డి

సమస్యల వలయంలో 'సంత'

- దుకాణాదారులకు, కొనుగోలుదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణంలో ప్రతి సోమవారం జరిగే వారపు సంత సమస్యల నడుమ సాగుతోంది. సంతలో కూరగాయలను విక్రయించడానికి వచ్చిన దుకాణదారులను, కొనుగోలు చేయడానికి వచ్చిన ప్రజలను అనేక సంవత్సరాల నుండి సమస్యలు వెంటాడుతూనే ఉన్నాయి. ఇదే ప్రాంతంలో ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, రైస్‌మిల్లులు ఉన్నాయి. పాఠశాలలు వదిలే సమయానికి సంత మార్కెట్ మొదలవుతుంది. అందులో ప్రధానంగా సంతకు వచ్చిన లగేజీ ఆటోలు, పట్టణంలోని షేర్ ఆటోలు, పాఠశాలల బస్సులు, పాదాచారులకు, సైకిళ్ళ మీద వెళ్లే విద్యార్థులకు, రైతు కూలీల ఆటోలతో ఇటుగా వెళ్లే రహదారి అంతా ట్రాఫిక్ జామ్ అవుతోంది. రైతులు, విద్యార్థులు, ప్రజలు, దుకాణాదారులు ఇలా అందరూ రహదారిలో వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. వ్యాపారస్తుల నుండి సంత మార్కెట్ పన్నులు వసూలు చేస్తున్నా వారికి సరైన స్థలం చూపిండంలో సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు విఫలమవుతున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సమీపించడంతో సంత మార్కెట్ వసూలు చేస్తున్న పన్నులతోనైనా వర్షపు నీరు రోడ్డుపైన నిల్వకుండా, వాహనాల పార్కింగ్, సంతలో దుకాణదారులకు కాస్త మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని ప్రజలు అధికారులను కోరుతున్నారు.

శాఖాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

శాఖాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం, ఆనందమని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. పిరమిడ్ ధ్యాన కేంద్రం వారి ఆధ్వర్యంలో శాఖాహార దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయం నుంచి పోలీస్ స్టేషన్, జిఎం టాకీస్, ఆస్థానం రోడ్, పాత బస్టాండ్ మీదుగా పిరమిడ్ ధ్యాన కేంద్రం వరకు శాఖాహారులు భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని శాఖాహారులకు సంపూర్ణ మద్దతును తెలిపారు. అనంతరం మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ శాఖాహారంతోనే మనిషికి సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు గాదం శెట్టి వేణుగోపాల్, డాక్టర్ గాదం శెట్టి రామనాథ్, డాక్టర్ రవి కుమార్, కిషోర్, టీచర్ ప్రభాకర్ రెడ్డి, మారుతి షోరూం యజమాని గుండా రవికుమార్, గుండా సుప్రజ, పిరమిడ్ ధ్యాన కేంద్రం సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

ముస్లిముల అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బనగానపల్లె

ముస్లిముల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో ముస్లిం సోదరులతో కలిసి పట్టణంలోని పలు అభివృద్ధి, సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఉర్దూ భవన్ అన్యాక్రాంతం కాకుండా అభివృద్ధి గురించి, షాదిఖానా ఎక్కడ ఏర్పాటు చేయాలనే అంశాలపై ఎమ్మెల్యే ముస్లిములతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ షాదీఖానా నూతనంగా నిర్మాణం చేపట్టడానికి రూ. 1 కోటి 20 లక్షలు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని తెలిపారు. పాత బస్టాండ్‌లోని ఉర్దూ భవన్ ప్రాంతంలో షాదీఖానా ఏర్పాటుకు తాను అడ్డుపడుతున్నానని మాజీ ఎమ్మెల్యే బిసి జనార్దన్ రెడ్డి చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని, అసలు అక్కడ షాదీఖానా ఏర్పాటుకు నిధులే మంజూరు కాలేదని, వాటి మీద చర్చకు ఎక్కడైనా సిద్ధమన్నారు. కేవలం ముస్లిములు ఓట్ల కోసమే 2019 ఫిబ్రవరిలో హుటాహుటిన షాదీఖానాకు శంకుస్థాపన చేశారని, ముస్లిం కమిటీ ద్వారా రూ. 30 లక్షలు కాంట్రిబ్యూషన్ డబ్బులు చూపించి షాదీఖానాకు నిధులు మంజూరైనట్లు ముస్లింలను మోసం చేశారన్నారు. షాదీఖానా కమిటీ ద్వారా రూ.30 లక్షలను మళ్లీ విత్ డ్రా చేసుకున్న బిసి జనార్దన్ రెడ్డి ముస్లిములకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తాను మొదటిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత బనగానపల్లె పట్టణంలోని ఈద్గా స్థలం అన్యాక్రాంతం కాకుండా రూ.30 లక్షలతో ప్రహరీ గోడ నిర్మించామని, రెండవసారి ఎన్నికైన తర్వాత ముస్లింల స్మశాన వాటిక స్థలం అన్యాక్రాంతం కాకుండా రూ.69 లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపట్టామని, త్వరలోనే పనులు పూర్తి చేసి ప్రారంభం చేయనున్నట్లు తెలిపారు. ముస్లింలకు తాను మేలు చేశాననే నమ్మకం ఉంటే తనను మళ్ళీ 2024 ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శివరామయ్య, షేక్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ అబ్దుల్ ఖైర్, వైసిపి మైనార్టీ నాయకులు అబ్దుల్ ఫైజ్, అత్తార్ జాహీద్ హుస్సేన్, డాక్టర్ మహ్మద్ హుస్సేన్, సైకిల్ షాప్ మహబూబ్ వలి, ఖాన్ రైస్ మిల్లు యజమాని ఇర్ఫాన్, జమాతే ఇస్లామిక్ సభ్యులు షబ్బీర్ హుస్సేన్, అరాఫత్, కూరగాయల రెహ్మాన్, పట్టణ ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు

పిఎం కిసాన్ బీమా వర్తింపజేయాలి

- ఎపి కౌలు రైతు సంఘం డిమాండ్

మాట్లాడుతున్న నాయకులు మార్క్

ప్రజాశక్తి - నంద్యాల రూరల్ : కౌలు రైతులకు పిఎం కిసాన్ పంటల ఉచిత బీమా పథకాన్ని వర్తింపజేయాలని ఎపి కౌలు రైతు సంఘం నంద్యాల జిల్లా అధ్యక్షుడు మార్క్స్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. గత నెల 25న రాష్ట్ర ముఖ్యమంత్రి పంటల బీమా, పీఎం కిసాన్ ఉచిత బీమాను పత్తి పంటకు జిల్లాల వారీగా రైతుల లిస్టు తయారు చేసి రిలీజ్ చేశారని తెలిపారు. అందులో సాగు చేస్తున్న కౌలు రైతుల పేర్లు లేకుండా విడుదల చేశారని చెప్పారు. భూ యజమాని సంబంధంతో కౌలు రైతులకు లింకు పెట్టడం వలన కౌలు రైతులు నిలువునా నష్టపోతున్న పరిస్థితి ఉందన్నారు. కౌలు రైతులకు ఈక్రాప్ నమోదు కావడం లేదని తెలిపారు. పొలం పాస్‌బుక్ జిరాక్స్, వన్ బి ఫారం ఇవ్వకపోవడంతో కౌలు రైతులను ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జిల్లాలోని పలు గ్రామాలలో. దాదాపు 2500 ఎకరాల్లో కౌలు రైతులు పత్తి చెట్లను పీకివేశారని, ఎకరానికి రూ.30 వేలు చొప్పున ఖర్చు పెట్టుకుని నష్టపోయారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతులకు అండగా నిలబడుతున్నామని చెబుతున్నా ఎక్కడ కూడా లబ్ధి పొందిన పరిస్థితి లేదన్నారు. ఇప్పటికైనా కౌలు రైతులకు పంటల ఉచిత బీమా అందేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

సామాజిక తనిఖీపై బహిరంగ చర్చ

ప్రజాశక్తి - రుద్రవరం : రుద్రవరంలోని ఉపాధి కార్యాలయం ఆవరణంలో ఉపాధి పనులపై ఎంపీపీ మబ్బు బాలస్వామి, ఎంపిడిఒ మధుసూదనరెడ్డి అధ్యక్షతన అడిషనల్ పిడి డాక్టర్ సలీం, ఎపిడి సాంబశివరావు ఆధ్వర్యంలో సోమవారం బహిరంగ చర్చా వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 17వ విడత సామాజిక తనిఖీ 1-4-2022 నుండి 31-03-2023 వరకు 770 పనులకు గాను రూ.7 కోట్ల 29 లక్షలు ఖర్చు చేసినట్లు తెలిపారు. మస్టరు, కొలతలు, ప్లాంటేషన్‌కు సంబంధించి రూ.10,683 రికవరీ చేయాల్సి ఉందని, అలాగే రూ.37,500 పెనాల్టీ వేశామన్నారు. కార్యక్రమంలో క్వాలిటీ కంట్రోల్ అధికారి గంగాధర్, ఎస్ఆర్పి కన్నా రెడ్డి, పిఆర్ ఏఈ వెంకట రాముడు, ఏపిఓ ప్రతాప్, ఈసీ సుబ్బన్న, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్స్ ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అధికారులు

విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు నిరసన తెలుపుతున్న దృశ్యం

అదనపు టీచర్లను నియమించండి

- హెచ్ కొట్టాలలో విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి - బేతంచెర్ల

మండల పరిధిలోని హెచ్ కొట్టాల గ్రామంలో అదనంగా ముగ్గురు లేదా నలుగురు టీచర్లను నియమించాలని గ్రామంలోని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాల ముందు సోమవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హెచ్ కొట్టాల గ్రామంలో 120 మంది విద్యార్థిని విద్యార్థులు ఎంపీ యూపీ స్కూల్ నందు ఉండగా ఎనిమిదవ తరగతి వరకు విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయులు మాత్రం ఇద్దరే ఉండడం వలన పిల్లలకు సరైన విద్య అందడం లేదని వారు అన్నారు. అదనంగా మరో ముగ్గురు లేదా నలుగురు ఉపాధ్యాయులు కావాలని కోరారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ప్రమీలకు వినతి పత్రం సమర్పించారు.

కౌన్సిలర్ తప్పుడు ధృవీకరణ పత్రంపై విచారణ చేపట్టాలి

- మాల మహానాడు

ప్రజాశక్తి - నందికొట్కూరు

మునిసిపాలిటి ఎన్నికల్లో తప్పుడు ధృవీకరణ పత్రాలతో గెలుపొందిన కౌన్సిలర్‌పై విచారణ చేపట్టాలని మాల మహానాడు నాయకులు కోరారు. సోమవారం నాడు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందనలో వైసిపి అభ్యర్థి తాటిపాటి ఏసమ్మ, మాలమహానాడు నాయకులు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా తాటిపాటి ఏసమ్మ మాట్లాడుతూ 2021 నందికొట్కూరు మునిసిపాలిటి ఎన్నికల్లో 12వ వార్డు కౌన్సిలర్ సీటు ఎస్‌సి జనరల్‌కు రిజర్వ్ చేయగా అందులో ఇండిపెండెంట్‌గా బిసి-ఏ (మంగలి) కమ్యూనిటికి చెందిన లాలు మోహన్ రవి శంకర్ ప్రసాద్ తప్పుడు ఎస్‌సి సర్టిఫికెట్‌తో పోటీ చేసి గెలుపొందారని నంద్యాల కలెక్టర్‌కు ఫిర్యాదు చేయగా.. స్పందించిన కలెక్టర్ 20-03-2023న విచారించి నివేదిక సమర్పించాలని నందికొట్కూరు తహశీల్దార్‌ను ఆదేశించారని తెలిపారు. 100 రోజులు గడిచినా విచారణ చేయలేదని తెలిపారు. అందువల్ల మరోమారు తహశీల్దార్‌కు స్పందనలో ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. మాల మహానాడు నాయకులు అయ్యన్న మాట్లాడుతూ కల్లూరు తహశీల్దార్ లాల్ మోహన్ తండ్రి, అబ్బ మంగలి కమ్యూనిటికి చెందినవారని ఎండార్స్‌మెంట్ ఇచ్చినా నందికొట్కూరు తహశీల్దార్ వాస్తవాలపై విచారణ చేయకపోవడం బాధాకరం అన్నారు. ఇప్పటికైనా తక్షణమే విచారించి కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాధితురాలు ఏసమ్మ మాల మహానాడు, దళిత సంఘాల నేతలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నాయకులు

చెంచు గూడెల మరణాలపై విచారణ

ప్రజాశక్తి - పాములపాడు

గత నెల జూన్ 23, 25వ తేదీలలో చెంచుగూడెల్లో నాగమల్లి (10), పెద్ద వీరన్న (45)ల మరణాలపై డిఎంఓ శారద భాయ్, మండల వైద్య అధికారిని నాగలక్ష్మి దేవి, ఎంపీడీవో గోపీకృష్ణ విచారణ చేపట్టారు. సోమవారం నాడు వేంపెంట చెంచుగూడెన్ని వారు సందర్శించి మరణించిన కుటుంబాల సభ్యులతో మరణాల గల కారణాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం డాక్టర్ నాగలక్ష్మి దేవి మాట్లాడుతూ నాగమల్లి టిబి వ్యాధి మందులు ఆరు నెలలు వాడిందని ఆమె కోర్సు జూన్ నెల 20 నాటికి కోర్స్ అయిపోయినట్లు డాక్టర్ వెల్లడించారు. అదేవిధంగా పెద్ద వీరన్నకు టిబి వ్యాధి కోర్స్ అయిపోయినట్లు తెలిపారు. పెద్ద వీరన్న ఆయాసంతో బాధపడుతూ మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారని ఆమె వెల్లడించారు. వీరికి పౌష్టిక ఆహారాలను అందించినట్లు ఆమె తెలిపారు. విచారణ నివేదికను పైఅధికారులకు పంపనున్నట్లు ఆమె తెలిపారు. ఎంపీడీవో గోపీకృష్ణ మాట్లాడుతూ గిరిజనులకు వారి స్థితిగతులు జీవనోపాధి ఇంటి నిర్మాణాలపై విచారించినట్లు తెలిపారు. జగనన్న ఇల్లు మంజూరైనప్పటికీ నిర్మించుకోలేని పరిస్థితి ఉందని గిరిజనులు తెలిపినట్లు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి తిప్పన్న, హెల్త్ సిబ్బంది పాల్గొన్నారు.

విచారణ చేస్తున్న అధికారులు

విశ్రాంత అంగన్వాడీలకు భరోసా కల్పించాలి : సిఐటియు

పదవి విరమణ పొందిన అంగన్వాడి టీచర్ జయలక్ష్మిని సన్మానిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - ఆత్మకూరు

జీవితాంతం గర్భిణీలకు, బాలింతలకు చిన్నపిల్లలకు సేవలందించి పదవీ విరమణ చేసిన తర్వాత అంగన్వాడీలకు భరోసా కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని, ఇప్పటికైనా పదవీ విరమణ అనంతరం జీతంలో సగం పెన్షన్ రూపంలో ఇచ్చి భరోసా కల్పించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి డి. రామ్ నాయక్, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు అధ్యక్షురాలు మంజుల, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు స్వాములు డిమాండ్ చేశారు. సోమవారం నాడు పట్టణంలో 20 అంగన్వాడి సెంటర్ అంగన్వాడీ కార్యకర్త జయ లక్ష్మి పదవీ విరమణ సందర్భంగా పూలమాల శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జయ లక్ష్మి 1976 నుండి అంగన్వాడి వ్యవస్థలో దాదాపు 40 సంవత్సరాలపాటు గర్భిణీలు, బాలింతలకు, చిన్న పిల్లలకు సేవలందించారు. అతి తక్కువ వేతనాలతో సేవలందించిన అంగన్వాడీలను ప్రభుత్వాలు బానిసల్లాగా చూస్తున్నాయే తప్ప వారి జీవితాలకు భరోసా కల్పించడం లేదన్నారు. అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గా అనేక ఆందోళనలు చేసినప్పటికీ గ్రాడ్యుటి పెన్షన్ రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడానికి ఈ ప్రభుత్వాలకు చేతులు రావడం లేదన్నారు. అంగన్వాడీలకు ఇప్పటికైనా గ్రాడ్యుటి జీతంలో సగం పెన్షన్ బెనిఫిట్స్ సౌకర్యాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగనవాడి కార్యకర్తలు లక్ష్మీదేవి, విజయలక్ష్మి, సుజాత, నాగమణి, వసుంధర తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలందరికీ ఇళ్లు కట్టించాలి : ఐఎఫ్‌టియు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

నిరుపేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని కర్నూలు జిల్లా ఉమ్మడి జిల్లా అధ్యక్షులు వై.ఆశీర్వాదం, ఏబెనహర్‌లు పేర్కొన్నారు. సోమవారం నాడు శ్రీశైలం ప్రాజెక్టు కాలనీలో స్థానిక ఆటోనగర్ నందు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టు కాలనీలో దాదాపు 35 వేలకు పైగా ప్రజలు నివాసం ఉంటున్నారని, ఇప్పటికీ సొంత ఇల్లు లేక అద్దె గృహలలో జీవిస్తున్నారని వారికి ఇళ్లు నిర్మించాలని కోరారు. వైసిపి ప్రభుత్వం వచ్చిన తరువాత సుండి పెంట గ్రామపంచాయతీ పరిధిలో కొంత మందికి ఇంటి పట్టాలు ఇచ్చారు గాని ఇంత వరకు వైయస్సార్ గృహాలు ఏర్పాటు చేయలేదన్నారు. ఇరిగేషన్ క్వార్టర్స్ లో ఉన్న వారికి ఉచితంగా గృహాలు ఇవ్వాలన్నారు.రిటైర్డ్ ఎంప్లాయిస్ వారుంటున్న క్వార్టర్స్ వారికి సదుపాయాలు కల్పించాలని కోరారు. భగత్ సింగ్ కాలనీలో స్మశానం పక్క 100 కుటుంబాలకు పైగా అక్కడ నివాసం ఉంటున్నారని కానీ రోడ్డుకు నోచుకోలేదన్నారు. కార్యక్రమంలో ఐఎఫ్టియు మండల అధ్యక్షులు వై. శ్రీను,కార్యదర్శి పి.మల్లికార్జున,ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బెనహర్, వలి, వెంకటేశ్వర్లు,బాబు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అఖిలప్రియను కలిసిన మల్లెల

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ఆళ్లగడ్డ మాజీ మంత్రి భూమా అఖిల ప్రియను నంద్యాల పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు మల్లెల రాజశేఖర్ గౌడ్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆళ్లగడ్డలోని మాజీ మంత్రి నివాసంలో భూమా అఖిలప్రియ, భార్గవ్ రామ్ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.

భూమా అఖిలప్రియ దంపతులతో మల్లెల రాజశేఖర్

పోలవరం నిర్వాసితులను ఆదుకోవాలి

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

పోలవరం నిర్వాసితుల కోసం పాదయాత్ర చేస్తున్నాం సిపిఎం పార్టీకి మద్దతుగా విరాళాలు సేకరిస్తున్న దృశ్యం

జాతీయ ప్రాజెక్టుగా గుర్తించిన పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. సిపిఎం ఆధ్వర్యంలో పోలవరం నిర్వాసితులకు మద్దతుగా వారికి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ చేపట్టిన మహా పాద యాత్రకు మద్దతుగా బండత్మూర్ మండలం సిపిఎం కమిటీ సభ్యులు రత్నమయ్య, డేవిడ్ రాజుల ఆధ్వర్యంలో సోమవారం విరాళాలు సేకరించారు. రూ. 4408 ప్రజల నుండి సేకరించి విరాళాలను సిపిఎం రాష్ట్ర కమిటీకి పంపడం జరుగుతుందని వారు తెలిపారు. కార్యక్రమంలో యోసేపు, చంద్రబాబు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

ఇన్నర్ వీల్ క్లబ్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి-డోన్

విద్యార్థిని సుమలత కు ఎనిమిది వేల రూపాయలను అందిస్తున్న మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్,ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులు

సమాజంలో ఇన్నర్ విల్ క్లబ్ చేసే సేవలు అమోఘమని డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో ఇన్నర్ విల్ క్లబ్ అధ్యక్షురాలు కె.షాలినిప్రకాష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డోన్ మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ హాజరయ్యారు.ఈ సందర్భంగా సప్తశైల రాజేష్ మాట్లాడు తూ ఇన్నర్ వీల్ క్లబ్ తరఫున సమాజంలో పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం అందించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం డోన్ శ్రీ సుధ స్కూల్‌లో చదువుతున్న సుమలత అనే విద్యార్థినికి ఇన్నర్ వీల్ క్లబ్ ప్రెసిడెంట్ కె.షాలినిప్రకాష్ ఎనిమిది వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని మున్సిపల్ చైర్మన్ అందజేశారు. విద్యార్థిని తల్లి సుమిత్ర ఇన్నర్ వీల్ క్లబ్ సభ్యులకు చైర్మన్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ ఫౌండర్ రాజా సుజాత,ఐడబ్ల్యూసి జిల్లా చైర్మన్ ఎస్.సుమిత్ర,సెక్రటరీ ఆర్టీసీ ఆర్ఎ.శాంతి తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలను అరికట్టాలి : రైతు సంఘం

ప్రజాశక్తి - నందికొట్కూరు

వినతి పత్రం ఇస్తున్న రైతు సంఘం నాయకులు

నకిలీ విత్తనాలు అరికట్టాలి అని ఏపీ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. నకిలీ విత్తనాల వల్ల, అతివృష్టి అనావృష్టి వల్ల రైతులు నష్టపోయారని తక్షణమే పంటల బీమా ఇన్సూరెన్స్ రైతుల ఖాతాలో తక్షణమే జమ చేయాలని సోమవారం నాడు స్పందన కార్యక్రమంలో తహసిల్దార్ రాజశేఖర్ బాబు, ఎంపీడీవో శోభారాణి, మున్సిపల్ కమిషనర్ కిషోర్ బాబు, అగ్రికల్చర్ ఎడిఎ అధికారులకు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పి వెంకటేశ్వర్లు, బి రాజు మాట్లాడుతూ 2021-22వ సంవత్సరంలో ప్రభుత్వము కేవలం కొన్ని పంటలకు మాత్రమే నష్టపరిహారం వేసిందని, నష్టపోయిన ప్రతి పంటకు నష్టపరిహారం వచ్చే విధంగా అధికారులు సర్వే చేయాలని కోరారు. రైతు భరోసా కేంద్రాల్లో పేరు నమోదు చేసుకున్న కొందరు రైతులకు పరిహారం అందలేదన్నారు. నిజమైన లబ్ధిదారులకు పరిహారం అందే విధంగా చూడాలన్నారు. లేకపోతే ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో ఆర్‌బికే సెంటర్లు, అగ్రికల్చర్ కార్యాలయాల దగ్గర ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు నాగన్న, ఎం శేఖర్, ఉపేంద్ర నాయుడు, రమణయ్య, శ్రీనివాసులు, మాధవ నాయుడు, దామోదర్, రామానాయుడు, మునిస్వామి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గురు పౌర్ణమి వేడుకలు

ప్రజాశక్తి - ఆత్మకూర్

పట్టణంలోని శిరిడి సాయిబాబా దేవాలయంలో గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా భక్తులు నిర్వహించారు. సోమవారం ఉదయం నుండి మండలంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున దేవాలయం చేరుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. దేవాలయ నిర్వాహకులు మధ్యాహ్నం 12 నుండి భక్తులకు ఉచిత అన్నదా నం కొనసాగించారు. దేవాలయం వద్ద ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు స్థానిక పోలీస్ అధికారులు ప్రత్యేక బందోబస్తును ఏర్పాటు చేశారు. **గీతా యోగాసన సంఘం ఆధ్వర్యంలో.. డోన్ :** గీతా యోగాసన సంఘం ఆధ్వర్యంలో గురు పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా యోగ సభ్యులు యోగా గురుజి రాంపుల్లయ్యను సన్మానించారు. యోగ సభ్యులు సీనియర్ న్యాయవాది నాగభూషణం రెడ్డి మాట్లాడుతూ గురువులను గౌరవించాలన్నారు. యోగ సభ్యులు మాకంబాలు, సముద్రాల బాబు,సంగాలసాయి బాబా, మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు. **చాగలమర్రి :** మండలంలోని ఆయా గ్రామాల్లో గురుపౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ షిర్డి సాయినాధుని ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు కైప నరసింహశాస్త్రి ఆధ్వర్యంలో మహిళలచే సాయినాధ వ్రతం చేయించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. **ఆళ్లగడ్డ:** పట్టణంలోని ఎంవి నగర్‌లో ఉన్న దత్త సాయి మందిరంలో గురు పౌర్ణమి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్ దత్త సాయి బాబా విగ్రహానికి ఆలయ ప్రధానార్చకులు క్రిష్టిపాటి వేదవ్యాస శర్మ ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం హారతి సేవలు, పల్లకి ఉత్సవం, ప్రత్యేక పూజలను నిర్వహించారు. విశేష సంఖ్యలో భక్తులు తరలి వచ్చి పూజలు, భజనలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కార్య నిర్వాహక కమిటీ అధ్యక్షుడు రామ్మోహన్ మల్లిక్, ఆలయ ధర్మకర్త సావిత్రమ్మ మీడియాతో మాట్లాడుతూ గురు పౌర్ణమి పర్వదినం పురస్కరించుకొని దత్త సాయి బాబా మందిరంలో ప్రత్యేక రీతిలో విశేష పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కాగా సిరివెళ్ల మెట్ల సమీపంలోని కాశిరెడ్డి నాయన ఆశ్రమం పక్కన ఉన్న సాయిబాబా మందిరంలో భక్తులు విశేష పూజలు నిర్వహించారు. **రుద్రవరం :** రుద్రవరంలో వెలసిన శిరిడి సాయిబాబా ఆలయంలో సోమవారం గురుపౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. నిర్వాహకులు శిరిడి సాయిబాబాకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. భక్తులకు నిర్వాహకులు భోజన వసతులు కల్పించారు. **బనగానపల్లె :** పట్టణంలో గురు పౌర్ణమి, వ్యాస పూర్ణమి వేడుకలను అత్యంత వేడుకగా, భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. యాగంటి పల్లె రోడ్డులో, ఆంజనేయ స్వామి దేవస్థానంలో, అవుకు రోడ్డులో, కైపలో ఉన్న సాయి బాబా దేవస్థానాల్లో గురు పౌర్ణమి వేడుకలను భక్తులు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. **కొలిమిగుండ్ల :** మండలంలో గురు పౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రంలోని సాయి బాబా దేవస్థానానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఎర్రగుడి గ్రామంలో వెలసిన సాయిబాబా దేవస్థానం నందు జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎర్రగుడి మాజీ సర్పంచ్ యాపర్ల వెంకటేశ్వర్ రెడ్డి, సర్పంచ్ కంబగిరి రాముడు, మాజీ సర్పంచ్ కంబయ్య, నందిపాడు సర్పంచ్ గురివిరెడ్డి, ప్రచార విభాగ అధ్యక్షులు సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు. **పాములపాడు :** మండల కేంద్రమైన పాములపాడులోని జూటూరు గ్రామ శివారులో గల శ్రీ నాగ సాయి విద్యా బ్రహ్మ ఆశ్రమం, శ్రీ శిరిడి సాయి దేవాలయాల్లో గురుపౌర్ణమి వేడుకలు ఆశ్రమ పీఠాధిపతి శ్రీ రామానంద స్వామి ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజాము నుండి స్వామివారికి అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు పీఠాధిపతి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

చాగలమర్రి : సాయినాధ వ్రతం చేస్తున్న మహిళలు

డోన్ : యోగా గురూజీ రాంపుల్లయ్యకు వస్త్రాలను అందిస్తున్న సీనియర్ న్యాయవాది నాగభూషణం రెడ్డి

పేదల సంక్షేమమే లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల రూరల్

పలు అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా

అన్ని వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యం అని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి అన్నారు. సోమవారం నంద్యాల మండలంలోని ఐలూరు గ్రామంలో 120వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని గ్రామ వైసిపి నాయకులు, నంద్యాల మండలం సచివాలయ కన్వీనర్ బసవేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో కలసి ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి,ఎమ్మెల్సీ ఇషాక్ బాషా రాష్ట్ర మార్క్ఫెడ్ చైర్మన్ పిపి నాగిరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు గడపగడపకూగ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా అందుతున్న ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలను గడప గడపకు వెళ్లి లబ్ధిదారులకు వివరించారు. పథకాలు అందుకుంటున్న వారి సంతప్తి స్థాయిని స్వయంగా తెలుసుకున్నారు. స్థానికంగా ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సత్వరం చర్యలు తీసుకోనున్నట్లు వారు తెలిపారు. నాడు నేడు ద్వారా 23 లక్షల రూపాయలతో ప్రభుత్వ పాఠశాలను రూపొందించడం జరిగిందన్నారు. నంద్యాల నియోజకవర్గం వైఎస్ఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అభివృద్ధిలో ముందుకు సాగుతుందని, నంద్యాలలో ఎప్పుడు లేనంతగా అభివృద్ధి జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సోషల్ మీడియా కోఆర్డినేటర్ మధుసూదన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వరరెడ్డి,నంద్యాల మండలం ఎంపీపీ శెట్టి ప్రభాకర్, ఎండిఓ సుగుణ శ్రీ, వైస్ ఎంపీపీ పుష్పలత, ఎంపీటీసీ రషీద్, వైస్ సర్పంచ్ శివ లలిత, సర్పంచ్, దావీద్, షఫీ, గ్రామ వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

షాదీ తోఫాలో న్యాయం చేయాలి

- కలెక్టర్‌కు దూదేకుల సంఘం వినతి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

షాదీ తోఫాలో దూదేకుల ముస్లింలకు న్యాయం చేయాలని దూదేకుల సంఘం నాయకులు జిల్లా కలెక్టర్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన స్పందనలో దూదేకుల సంఘం నాయకులు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు వాసవి దస్తగిరి, ప్రధాన కార్యదర్శి ఆదాం సాహెబ్‌లు మాట్లాడారు. స్వతంత్రం వచ్చినప్పటి నుండి దూదేకుల ముస్లింలకు షాదీ తోఫా, దుల్హన్ పథకం లాంటి మైనార్టీ పథకాలలో ముస్లింలతో సమానంగా లబ్ధి చేకూరేదని, వైసిపి ప్రభుత్వం విడుదల చేసిన షాదీ తోఫాలో ముస్లింలకు రూ.లక్ష, దూదేకుల వారికి రూ. 50 వేలు ఇవ్వడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో కోశాధికారి సోమశేఖర్, నాయకులు హుస్సేన్, గబ్బర్ దస్తగిరి, పోస్టల్ హసన్ బాషా, సీడ్స్ బాబు, నాగరాజు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

ప్రజాశక్తి - నందికొట్కూరు

ఎస్‌సి వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ జె ప్రకాష్ మాదిగ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని స్థానిక జై కిసాన్ పార్కు నందు మాదిగ దండోరా రాయలసీమ జిల్లాల ప్రధాన కార్యదర్శి పగడం రాఘవయ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షులు ఆర్జె ప్రకాష్ మాదిగ, తదితర నాయకులు హాజరయ్యారు. ఈకార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర అధ్యక్షులు ఆర్.జె ప్రకాష్ మాదిగ మాట్లాడుతూ వంద రోజుల్లో వర్గీకరణ పూర్తి చేస్తానని చెప్పిన నమ్మించి మోసం చేసి బిజెపి వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టడంలో నిర్లక్ష్యం వహిస్తుందని అన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీలలో ఏబిసిడి వర్గీకరణ అంశాన్ని పార్లమెంట్లో ప్రవేశపెట్టేలా తగిన చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో మాదిగ దండోరా ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం నందికొట్కూరు నియోజకవర్గ కమిటీ సభ్యులుగా నియోజవర్గ ఇంచార్జ్ నగేష్, ప్రధాన కార్యదర్శిగా పగడం శేఖర్, మండల అధ్యక్షులుగా ఎల్ల రాజును, వివిధ మండలాల కమిటీ నాయకులను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ దండోరా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్పందన అర్జీదారులకు అన్నదానం

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

కలెక్టరేట్‌లోని ఆవరణంలో స్పందన అర్జీదారులకు రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. హౌసింగ్ పిడి భాస్కర్ నాయుడు, పంచాయతీ రాజు అధికారి రామ్మోహన్, డిఆర్ఒ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న తహశీల్దారు హసీనా ముఖ్య అతిథులుగా హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పి సిఇఒ సుబ్బారెడ్డి, రెడ్‌క్రాస్ జిల్లా కోశాధికారి నాగేశ్వరరావు, డిఎఫ్ఒ రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

సిసి రోడ్డు వేయాలని ఎంపిడిఒకు వినతి

ప్రజాశక్తి - పాములపాడు

పాములపాడు గ్రామంలో కెసి కెనాల్ సమీపంలో ఉన్న వాటర్ ట్యాంక్ నుండి రామాలయం మీదుగా బొడ్రాయి సందు వరకు సిసి రోడ్డు నిర్మించాలని సోమవారం నాడు స్పందనలో ఎంపీడీవో గోపికృష్ణకు వార్డు మెంబర్ ఉలియమ్మ, అవాజ్ కమిటీ నాయకులు సోడా బాషా, మహమ్మద్ గని, గ్రామస్తుల శంకర్ గౌడ్ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిసి రోడ్డు వేయాలని గత గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్ర మంలో ఎమ్మెల్యే భూమి పూజ చేసి దాదాపు ఆరు నెలలు కావస్తు న్నప్పటికీ నేటికీ రోడ్డు వేయలేదని అన్నారు. రోడ్డు సరిగా లేక నీరు నిల్వ ఉండడం పలు ఇబ్బందులకు కాలనీవాసులు గురవుతున్నారని తక్షణమే రోడ్డు నిర్మించాలని వారు ఎంపిడిఒను కోరారు.

ఫొటోగ్రాఫర్లను ఆదుకోవాలి

ప్రజాశక్తి - బనగానపల్లె

ఫొటోగ్రాఫర్లను ప్రభుత్వం ఆదుకోవాలని జెకెఆర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు జెఎస్ బ్రహ్మానంద ఆచారి కోరారు. సోమవారం మండలంలోని పలుకూరు గ్రామం రామాలయంలో జెకెఆర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పొద్దుటూరు పట్టణానికి చెందిన మనం ఫౌండేషన్ అధ్యక్షుడు చక్రవర్తి సహకారంతో సీనియర్ ఫొటోగ్రాఫర్ రాజును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేల మాటలను వ్యక్తం చేయగలిగేది ఒక ఫొటో అని, అలాంటి ఫొటోలు తీసే ఫొటోగ్రాఫర్లు సెల్‌ఫోన్ వచ్చిన తర్వాత జీవనోపాధి కోల్పోయి దుర్భరమైన జీవితం గడుపుతున్నారని తెలిపారు. ఫొటోగ్రాఫర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని కోరారు. బాల సరస్వతి భజన మండలి అధ్యక్షుడు బాల హనుమంతు, కేఈ వెంకట సుబ్బయ్య గౌడు, తెలుగు భాష అభివృద్ధి సంఘం అధ్యక్షుడు రాజు, బాలిశెట్టి, ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు.

ఘనంగా క్రైస్తవ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని వైయస్ నగర్‌లోని హోసన్నా వృద్ధాశ్రమంలో భారత క్రైస్తవ దినోత్సవం వేడుకలను ప్రార్థనలు చేసి ఘనంగా నిర్వహించినట్లు హోసన్నా వృద్ధాశ్రమ నిర్వాహకులు జాన.ప్రభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీస్తు గురించి వివరించారు. అనంతరం హోసన్న వృద్ధాశ్రమంలో తోమ ఆత్మ శాంతి కొరకు అతను చేసిన సేవలను గుర్తు చేసుకుంటూ ఆశ్రమంలో ప్రార్థనలు చేశారు.

వృద్ధాశ్రమంలో క్రైస్తవ దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

- జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

స్పందనలో వచ్చిన అర్జీలకు ఫిర్యాదిదారులు సంతృప్తి చెందేలా చట్ట పరిదిలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి సంబందిత పోలీస్ అధికారులను ఆదేశించారు. నంద్యాలలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఫిర్యాదిదారుల నుంచి జిల్లా ఎస్పీ అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులతో ఎస్‌పి స్వయంగా ఫోన్‌లో మాట్లాడి చట్టపరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.

స్పందన ఫిర్యాదులు మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని, నిర్లక్ష్యంగా వ్యవహరించరాదన్నారు. ఫిర్యాదిదారులకు ఓంకారం ధేవస్థానం వారిచే భోజన వసతి ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ డిఎస్పి జె వి సంతోష్, సీఐ దస్థగిరి బాబు పాల్గొన్నారు.

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O. S.No.142/2022

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, చాగలమర్రి
R/its బ్రాంచ్ మేనేజర్. ...వాది

V/S

1) జి.బాలయ్య
2) జి.నారాయణ. ...ప్రతివాదులు

2 వ ప్రతివాదికి సమన్లు

గిట్ట నారాయణ,
S/o. నాగన్న
R/o. 10-34,S.C.కాలని,
చాగలమర్రి - గ్రామం & మండలం,
నంద్యాల -జిల్లా.

పై నెంబరు దావాలో వాది బాకీ రాగోరి 1,2 ప్రతివాదులపై దావా దాఖలు చెయ్యగా కోర్టు వారు 2 వ ప్రతివాదికి సమన్లు ఎన్నిసార్లు పంపిననూ మీ నుండి ఎటువంటి జవాబు లేనందున పై కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా మీ హాజరుకై 19-07-2023 వ తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు గాని, మీ తరపున న్యాయవాది గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోగలరు. లేని యెడల మీ పరోక్షములో పై దావాను తీర్మానము జరుగునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 19-07-2023

పి.యస్.మహబూబ్ బాష,
వాది తరపున అడ్వకేట్,
చాగలమర్రి - పోస్ట్,
నంద్యాల - జిల్లా

మహారాజశ్రీ ఆళ్లగడ్డ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O. S.No.200/2022

ఆంధ్ర ప్రగతి గ్రామీణ బ్యాంక్, చాగలమర్రి
R/its బ్రాంచ్ మేనేజర్.
...వాది

V/S

1) జె.అబ్దుల్ బాష
2) బి.సుదర్శన్. ...ప్రతివాదులు

1వ.ప్రతివాదికి సమన్లు

జంగ్లి అబ్దుల్ భాష,
S/o. మహబూబ్ సాహెబ్
R/o. H. No.8-6-40,
రామసుబ్బారెడ్డి వీధి,
చాగలమర్రి - పోస్ట్,
నంద్యాల -జిల్లా.

పై నెంబరు దావాలో వాది బాకీ రాగోరి 1,2 ప్రతివాదులపై దావా దాఖలు చెయ్యగా కోర్టు వారు 1 వ ప్రతివాదికి సమన్లు ఎన్నిసార్లు పంపిననూ మీ నుండి ఎటువంటి జవాబు లేనందున పై కోర్టు వారు పేపరు ప్రకటన ద్వారా మీ హాజరుకై 19-07-2023 వ తేదీన ఉదయం 10:30 గంటలకు మీరు గాని, మీ తరపున న్యాయవాది గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకోగలరు. లేని యెడల మీ పరోక్షములో పై దావాను తీర్మానము జరుగునని ఇందుమూలముగా మీకు తెలియజేయడమైనది.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

వాయిదా : 19-07-2023

పి.యస్.మహబూబ్ బాష,
వాది తరపున అడ్వకేట్
చాగలమర్రి - పోస్ట్